

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**అమరావతికి అమ్మ పేరిట రూ.కోటి**
- తల్లి కోగంటి ఇందిరాదేవి పేరిట విరాళం
- సీఎంకు చెక్ అందించిన విజయలక్ష్మి

3

# కీలక పాలసీలకు క్లియరెన్స్



## కాలంతో పరిగెత్తాలి!

- పోలవరం పనుల్లో గంట కూడా వృథా కాకూడదు
- రెండోవారంలో పోలవరం ప్రాజెక్ట్ షెడ్యూల్ విడుదల
- వాటర్ పాలసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం
- సమావేశ వివరాలు వెల్లడించిన జలవనరుల మంత్రి
- వాళ్లేవుంటే.. వెలిగొండపై ఆశలు వదిలేసేవాళ్లం..
- జగన్, అంబటిపై మంత్రి నిమ్మల సెటైర్లు

6

- ప్రతి బిందువునూ ఒడిసి పట్టేలా వాటర్ పాలసీ: నిమ్మల



- ఐటీ, టెక్స్‌టైల్, మారిటైంకు కేబినెట్ ఆమోదం
- సమీకృత పర్యాటక పాలసీకీ ఓకే
- 'ఆయుర్వేద' రిజిస్ట్రేషన్ చట్టసవరణకు ఆమోదం
- ఉద్దానం, పులివెందుల, డోన్‌కు తాగునీటి ప్రాజెక్టులు
- ఆత్మార్పణ సంస్మరణ దినంగా డిసెంబర్ 15
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు
- శరవేగంగా అమరావతి పనులు: మున్సిపల్ మంత్రి నారాయణ

2

**కాకినాడ పోర్టు, సెజ్ ఆక్రమణపై సీఐడీ విచారణ: చర్చించిన చంద్రబాబు**

4

**ఆత్మవిశ్వాసానికి మీరు ప్రతీకలు**
- దివ్యాంగులకు సీఎం శుభాకాంక్షలు

4

## ఎస్‌హెచ్‌జీల బలోపేతం

- ఆదాయాన్నిబట్టి స్థాయీ వర్గీకరణ
- ఇక..'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్'
- ఎంఎస్‌ఎంఈలుగా స్వయం సంఘాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

3

## డ్రోన్ల సాయంతో నేర నియంత్రణ

- ప్రభుత్వ విభాగాల్లో విస్తృతంగా వాడాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- సచివాలయంలో మల్టీపర్పస్ డ్రోన్ డెమో పరిశీలించిన సీఎం

3



## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం!

- ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై స్టార్ రేటింగ్
- పండుగ వాతావరణంలో మెగా పీటీఎం నిర్వహణ
- చాగంటి సూచనల మేరకు నైతిక విలువలపై పాఠ్యాంశాలు
- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు 100 రోజుల ప్రణాళిక
- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యపై సమీక్షలో మంత్రి లోకేష్

- వివరాలు 4లో..

ఈ జాతీయ అవార్డు..

## ఆంధ్రప్రదేశ్ మోడల్ సత్ఫలితాలకు నాంది

4

- విద్యాశాఖ, సమగ్రశిక్షా, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కృషికి తగిన గుర్తింపు లభించింది
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఏపీకి గర్వకారణం
- విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ అభినందనలు





**దివ్యాంగులను వెన్నుతట్టి ప్రోత్సహించాలి**
- నారా భువనేశ్వరి పిలుపు

5

**విలీనానంతర సమస్యల పరిష్కారానికి చర్యలు**
- అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు
- ఆర్టీసీ అధికారులకు రవాణా మంత్రి మండిపల్లి ఆదేశం

7

**దొంగ రిజిస్ట్రేషన్లు, భూ ఆక్రమణలు**
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ, కుడుపూడి సత్తిబాబు



- వివరాలు 8లో..

**మా వియ్యంకుడి వ్యాపారానికి రేషన్ బియ్యంతో సంబంధం లేదు**
- అనుమానం ఉంటే తనిఖీ చేసుకోవచ్చు
- పేర్ని నాని విమర్శలను తిప్పికొట్టిన మంత్రి పయ్యావుల

7


లోపలి పేజీల్లో..

**9న విశాఖ డెయిరీకి సభా సంఘం**
- అక్రమాలపై విచారణ 7

**అగ్నిలో అవినీతి**
- సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌పై వేటు 10

**వక్ఫ్‌బోర్డుపై నీలి మీడియా దుష్ప్రచారం సిగ్గుచేటు**
- ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ ఆగ్రహం 6

**సూటిగా..గణాంకాలతో..**
- ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలకు పెమ్మసాని దీటైన జవాబు 8

**సౌదీలో చిక్కుకున్న సిక్కోలు యువకులను స్వదేశానికి రప్పించండి**
- విదేశాంగ మంత్రి జైశంకర్‌కు రామ్మోహన్‌నాయుడు వినతి 10

చైతన్యరథం

# కీలక పాలసీలకు క్లియరెన్స్



- ఐటీ, టెక్స్‌టైల్, మారిటైంకు కేబినెట్ ఆమోదం
- సమీకృత పర్యాటక పాలసీకీ ఓకే
- 'ఆయుర్వేద' రిజిస్ట్రేషన్ చట్టసవరణకు ఆమోదం
- ఉద్దానం, పులివెందుల, డోన్‌కు తాగునీటి ప్రాజెక్టులు
- ఆత్మార్పణ సంస్మరణ దినంగా డిసెంబర్ 15
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు
- శరవేగంగా అమరావతి పనులు: మున్సిపల్ మంత్రి నారాయణ

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎం ఆవాస్ యోజన గిరిజన గృహ పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత ఐదేళ్లలో నిర్మించని గృహాల రద్దుపై సమావేశంలో నిర్ణయం తీసుకుంది. సమీకృత పర్యాటక పాలసీ 2024-29, 2024-29 స్పోర్ట్స్ పాలసీలో మార్పులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

కేబినెట్ సమావేశం వివరాలను రాష్ట్ర సమాచార మంత్రి కొలుసు పార్థసారథి, మున్సిపల్ మంత్రి పి.నారాయణ మీడియాకు వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చడానికి కొన్ని ముఖ్యమైన పాలసీలను కేబినెట్ ఆమోదించిందని మంత్రి కొలుసు వివరించారు. వాటిలో ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0, ఏపీ టెక్స్టైల్స్ గార్మెంట్ పాలసీ, ఏపీ మారిటైమ్ పాలసీ ఉన్నాయన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీకి గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0 తీసుకొచ్చినట్టు వివరించారు. అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు నేడు ప్రపంచ వ్యాపారరంగంలో కీలకంగా మారాయని, సాంకేతిక వ్యాపార పరిభాషలో వీటిని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) అంటారన్నారు. కొన్ని కీలక విధుల నిర్వహణకు బహుళజాతి సంస్థలు (ఎంఎన్‌సీలు) విదేశాల్లో ఏర్పాటు చేసే కేంద్రాలని, రిమోట్ వర్క్, హైబ్రిడ్ వర్క్ మరియు కో-వర్కింగ్ స్పేస్‌లవంటి అత్యాధునిక సర్వీస్ డెలివరీ మోడళ్లను ఏర్పాటు చేయడం పాలసీ లక్ష్యంగా వివరించారు. నూతన ఆవిష్కరణలు, గిగ్ ఎకానమీ, వ్యవస్థాపకత మరియు స్థిరమైన ఆర్థిక అభివృద్ధికై పెద్దఎత్తున సాంకేతిక ఆధారిత విద్యార్థులను, ప్రతిభావంతులైన వర్క్ ఫోర్స్‌ను, సహాయక ప్రభుత్వ విధానాలతో సహా ఆంధ్రప్రదేశ్ యొక్క వ్యూహాత్మక ప్రయోజనాలను ఉపయోగించుకోవడానికి ఈ విధానం ప్రయత్నిస్తుందని చెప్పారు. స్వర్ణ ఆంధ్ర విజన్-2047లో భాగంగా రాష్ట్రం ప్రతిష్ఠాత్మకమైన "ఒకే కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యానికి కట్టుబడి ఉందన్నారు. మౌలిక సదుపాయాలను సత్వరమే సృష్టించడానికి ప్రభుత్వం కో-వర్కింగ్ స్పేస్‌లు, పొరుగు వర్కుస్పేస్‌లను పెద్దఎత్తున ప్రోత్సహించాలని భావిస్తోందన్నారు. ఇందుకు ప్రోత్సాహకాలను కూడా పెద్దఎత్తున అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కో-వర్కింగ్ స్పేస్ అంటే ఒక సెంటర్‌ను ఏర్పాటుచేసి అక్కడే ఐటీ కంపెనీ, షాపింగ్ కాంప్లెక్సు, ఎంటర్టైన్మెంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని, తిరుపతి, వైజాగ్, విజయవాడ, అమరావతి తదితర పెద్ద కేంద్రాల్లో పొరుగు వర్కింగ్ స్పేస్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పొరుగు వర్కింగ్ స్పేస్ సెంటర్లకు అనుబంధంగా గ్రామాల్లో, మండలాల్లో కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు పనిచేస్తాయి. ఆయా ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత పనిచేసే వాతావరణాన్ని ఈ సెంటర్ల ద్వారా కల్పించడం జరుగుతుంది. కనీసం 100 సీట్ల నుండి 10 వేల చదరపు అడుగులతో కో-వర్కింగ్ స్పేస్ సెంటర్లు అభివృద్ధి పర్చేవారికి పెట్టుబడిలో 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది. గరిష్టంగా రూ.2 వేలను ఒక చదరపు అడుగుకు రాయితీగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. పొరుగు వర్కింగ్ స్పేస్ సెంటర్లలో కనీసం వేయి చదరపు అడుగుల అభివృద్ధి పర్చిన ఏరియాతోపాటు కనీసం పది సీట్లుంటే పెట్టుబడిలో 50 శాతం రాయితీతోపాటు రూ.1,000/- లు ఒక చదరపు అడుగుకు రాయితీగా ఇస్తామన్నారు. ప్రతి సీటుకు రూ.1,000/-ల చొప్పున ఆరు మాసాల్లో ప్రోత్సాహకాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. 5 లక్షల చదరపు అడుగుల ఫ్లోర్ ఏరియా పైబడిన ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేసేవారికి పెట్టుబడిలో 50 శాతం రాయితీ, ఐదేళ్లలో రూ.2,000/- ప్రతి స్క్వేర్ ఫీట్‌కు ఇస్తామన్నారు. ఈ రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకొచ్చినట్టు వివరించారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలనే లక్ష్యంతో ఈ పాలసీ రూపొందించామన్నారు. ఈ పాలసీ అట్టడుగుస్థాయిలో వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించడం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను గ్లోబల్ మార్కెట్ స్థాయికి తీసుకెళ్లేందుకు, వారు అత్యధిక జీత భత్యాలను పొందేందుకు దోహదపడుతుందని మంత్రి కొలుసు వివరించారు.

## ఏపీ టెక్స్‌టైల్స్ గార్మెంట్ పాలసీ

ఈ పాలసీ కింద చేసిన ప్రతిపాదనలకు మంత్రిమదలి ఆమోదం లభించింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉద్యోగాలు కల్పించే రంగం ఇది. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్, గార్మెంట్స్ పాలసీని రూపొందించారు. 2024 - 2029 కాలంలో రాష్ట్రంనుంచి వస్త్ర ఎగుమతుల్ని వన్ బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. మన రాష్ట్రంలో ఈ రంగంలో మంచి నైపుణ్యం కలిగిన పద్మశాలీలు, చేనేత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పాలసీ దోహదపడుతుంది. ఇందుకై అవసరమైన మౌలిక వసతులతో పార్కులను ఏర్పాటు చేయడంతో పాటు, రాయితీలనూ పెద్దఎత్తున ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ఐదు కొత్త సమగ్ర టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పార్కులను మూడు కేటగిరీలుగా విభజించి ఎంఎస్‌ఎంఇలకు 30 శాతం, మధ్యతరహా పార్కులకు 20 శాతం, భారీ పార్కులకు 25 శాతంమేర పెట్టుబడి రాయితీ అందించనున్నారు.

## మౌలిక వసతులు మరియు పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ పాలసీ 4.0 (2024-29) ప్రతిపాదనకు మంత్రిమండలి ఓకే చెప్పింది. 975 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతాన్ని ప్రభావితం చేస్తూ ప్రపంచస్థాయి సముద్ర తీర రాష్ట్రంగా అభివృద్ధిపర్చాలనే లక్ష్యంతో మారిటైమ్ పాలసీని రూపొందించారు. ఈ విషయంలో గుజరాత్ ప్రథమ స్థానంలోను, ద్వితీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నది. సరుకు రవాణా విషయంలో ఏడాదికి గుజరాత్ 450 మిలియన్ టన్నులు చేస్తుంటే, మన రాష్ట్రంలో కేవలం 180 మిలియన్ టన్నులను మాత్రమే చేయడం జరుగుచున్నది. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధితోపాటు సమీప ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందించాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. షిప్ బిల్డింగ్ పరిశ్రమను కూడా అభివృద్ధిపర్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఒక మెగా షిప్ యార్డును ఏర్పాటు చేసేందుకు ప్రధానితో సీఎం చర్చిస్తున్నారని మంత్రి కొలుసు వివరించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన మారిటైం హబ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. నౌకల నిర్మాణానికి సంబంధించి షిప్ బిల్డింగ్ క్లస్టర్లు, ఇతర అనుబంధ ప్రాజెక్టులు వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకోనున్నారు..

## పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ

జలవనరుల శాఖ ప్రతిపాదనల మేరకు శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, పులివెందుల, డోన్ సెగ్మెంట్లలో మూడు నీటి సరఫరా ప్రాజెక్టుల ధర సర్దుబాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. తక్కువ వర్షపాతం, కరువు కారణంగా అక్కడ నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ 3 నీటి సరఫరా ప్రాజెక్టులను కొనసాగించడం ద్వారా నీటి సమస్యలను అధిగమించడం జరుగుతుంది. దీని ద్వారా 10.37 లక్షలమంది ప్రజలకు త్రాగునీటి సమస్య తీరనుంది.

## గృహ నిర్మాణం

పీఎంఏవై అర్బన్ 1.0 పథకం కొనసాగింపు మరియు ప్రస్తుత యూనిట్ ధరతో ఇళ్లను పూర్తి చేయడం, 3 ఎంపికల కింద నిర్మాణంలో ఉన్న పద్ధతి, మెటీరియల్ సరఫరా, కొత్త ఇసుక విధానాన్ని అనుసరించడం మరియు డ్రోన్‌లను ఉపయోగించి పెద్ద లేఅవుట్‌లలో నాణ్యత పరీక్ష నిర్వహించడం, హౌసింగ్ కాలనీలలో మౌలిక సదుపాయాలను చేపట్టడానికి చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదించింది. 2024 డిసెంబరు నాటికి ఈ పథకాల కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలనే నిబంధన ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు 2026 మార్చి వరకూ గడువు ఇవ్వడం జరిగింది. అర్బన్‌లో 6.41 లక్షల ఇళ్లు, గ్రామాల్లో 1.09 లక్షల ఇళ్లను పూర్తి చేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు.

## ఆయుర్వేద, హెూమియోపతి ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద మరియు హెూమియోపతిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1956 బోర్డుల నామకరణాన్ని మార్చడంతో పాటు నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ యాక్ట్ 2020కి అనుగుణంగా బోర్డును పునర్నిర్మించడానికి చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పిలవబడుతున్న ఆంధ్రా బోర్డు ఆఫ్ ఆయుర్వేదాన్ని ఇకపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్‌గా పిలుస్తారు. అలాగే ఆంధ్రా బోర్డు ఫర్ హెూమియోపతిని ఇకపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ హెూమియోపతిగా పిలుస్తారు.

## యూత్ అడ్వాన్సుమెంట్, టూరిజం అండ్ కల్చర్

ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024-2029 యొక్క సమగ్ర విధానానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పర్యాటకంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టేలా.. భారీగా పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా కొత్త పర్యాటక విధానం రూపొందించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకుతోడు ప్రభుత్వ

- (మిగతా వివరాలు 3లో)

# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం!

- ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్
- పండుగ వాతావరణంలో మెగా పీటీఎం నిర్వహణ
- చాగంటి సూచనల మేరకు నైతిక విలువలపై పాఠ్యాంశాలు
- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు 100 రోజుల ప్రణాళిక
- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యపై సమీక్షలో మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో హాజరు శాతం, విద్యాప్రమాణాల మెరుగుదల కోసం రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేష్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... పదోతరగతి పూర్తిచేసిన పేద విద్యార్థుల్లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉంటున్నారన్నారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం ద్వారా డ్రాపౌట్స్‌ను కొంతమేర తగ్గించే అవకాశం ఉందని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో వెనుకబడిన విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్ అందించాలని సూచించారు. 'సంకల్ప్' ద్వారా నిర్వహించే ఇంటర్ విద్యార్థుల ఎసెస్‌మెంట్ ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిని మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ఆయా కళాశాలల లెక్చరర్లు, సిబ్బందిని కేర్ టేకర్స్‌గా నియమించాలని నిర్ణయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బాగా దెబ్బతిన్న భవనాలకు ఇతర ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7వతేదీన నిర్వహించే మెగా పేరెంట్-టీచర్ సమావేశాలను (పీటీఎం) పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారు. మంత్రులు, శాసనసభ్యులు వారు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో జరిగే మెగా పీటీఎం సమావేశాలకు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి పార్టీ జెండాలు, హంగు, ఆర్భాటాలకు తావీయవద్దని స్పష్టం చేశారు. బాపట్ల ప్రభుత్వ హైస్కూలులో నిర్వహించే మెగా పీటీఎం కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోపాటు తాను కూడా హాజరుకానున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు.

### 18 అంశాలు ప్రామాణికంగా రేటింగ్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన లక్ష్యంగా స్టార్ రేటింగ్ ఇవ్వాలని సమావేశంలో నిర్వహించారు. ఇందుకోసం 18అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత మెరుగుపర్చేందుకు 100 రోజుల ప్రణాళికను అమలు చేయాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేజీ టు పీజీ కరిక్యులమ్ ప్రక్షాళనపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే పాఠ్యాంశాల కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల్లో లైఫ్ స్కిల్స్, సామాజిక బాధ్యత పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా చిన్నతనం నుంచే బాలలు, బాలికలు సమానమేనన్న భావన కలిగించేలా లింగ సమానత్వం, సివిక్ సెన్స్‌పై అవగాహన పెంచాలని తెలిపారు. విద్యార్థులకు జపనీస్ మోడల్ లైఫ్ స్కిల్స్‌ను అలవర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల విద్యకు గొడ్డలిపెట్టులా గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 117ను రద్దుచేయాలని నిర్ణయించిన నేపథ్యంలో మెరుగైన విధానం అమలుకు గ్రామస్థాయిలో అభిప్రాయ సేకరణ జరపాలని, ఈ సమావేశాలకు స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీలను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు. స్కూలు మైదానాల్లో జాబ్ మేళాలకు మినహా ఎటువంటి కార్యకలాపాల నిర్వహణకు అనుమతి ఇవ్వరాదని మంత్రి స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.

---

## ఆత్మవిశ్వాసానికి మీరు ప్రతీకలు

### ప్రపంచ దివ్యాంగులకు సీఎం శుభాకాంక్షలు



అమరావతి (చైతన్య రథం): ఆత్మ విశ్వాసంతో ముందుకు అడుగులేస్తున్న దివ్యాంగులకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'ఆత్మ విశ్వాసాన్ని అణువణువునా నింపుకుని అందరితో సమానంగా ముందడుగేస్తోన్న దివ్యాంగులకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు. ప్రోత్సహిస్తే దివ్యాంగులు ఏదైనా సాధించగలరని మేం బలంగా నమ్ముతాం. అందుకే దివ్యాంగులకు మొదటి నుంచీ తెలుగుదేశంపార్టీ అండగా ఉంటోంది. దివ్యాంగుల కోసం మూడు చక్రాల మోటారు వాహనాలు, స్వయం ఉపాధి పొందేందుకు రూ.1 లక్ష సబ్సిడీతో రుణాలు అందించి అండగా నిలిచాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచి ఇస్తున్నాం. దేశంలో దివ్యాంగులకు రూ.6 వేలు పింఛను ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని చెప్పడానికి చాలా సంతోషపడుతున్నాను. అవరోధాలను, సవాళ్లను అధిగమించి... మీరు జీవితంలో విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికపై పోస్టు చేశారు.

### కాకినాడ పోర్టు, సెజ్ ఆక్రమణపై

## సీఐడీ విచారణ: సీఎం చంద్రబాబు

అమరావతి: కాకినాడ పోర్టు, సెజ్ ఆక్రమణపై సీఐడీ విచారణ జరిపిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబుఅన్నారు.మంత్రి వర్గ సమావేశం అనంతరం మంత్రులతో సీఎం.. వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టు అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. "కాకినాడ పోర్టును, కాకినాడ సెజ్‌ను బలవంతంగా లాక్కున్నారు. పోర్టు లాగేసుకుని 41శాతం కేవీ రావుకు ఇచ్చేసి 59శాతం అరబిందో వాళ్లకు అప్పగిం చారు. ఆస్తులను గుంజుకోవడం రాష్ట్రంలో కొత్త ట్రెండ్ అయ్యింది. ఇంతకుముందు ఎప్పుడూ ఇలాంటివి చూడలేదు. వైకాపా ప్రభుత్వంలో వ్యవస్థలను బాగా డ్యామేజ్ చేశారు. వీటన్నింటిపై సీఐడీ విచారణ జరిపిద్దాం" అని మంత్రులతో చంద్రబాబు అన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రానికి సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనేదానిపై మంత్రులతో సీఎం చర్చించారు.

---

### ఈ జాతీయ అవార్డు..

## ఆంధ్రప్రదేశ్ మోడల్ సత్ఫలితాలకు నాంది

- విద్యాశాఖ, సమగ్రశిక్షా, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కృషికి తగిన గుర్తింపు లభించింది
- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఏపీకి గర్వకారణం
- రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ అభినందనలు



అమరావతి (చైతన్యరథం): విద్యావ్యవస్థలో దేశానికే దిక్సూచిలా నిలిచే ఆంధ్ర మోడల్ సత్ఫలితాలకు తాజా జాతీయ అవార్డు నాంది పలికిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో మంగళవారం భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, దివ్యాంగ సాధికారత విభాగం (దివ్యాంగ జన్) ఆధ్వర్యంలో జరిగిన 'నేషనల్ అవార్డ్స్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ 2024' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బెస్ట్ స్టేట్ ఇన్ ఇంప్లిమెంటింగ్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ యాక్ట్ (దివ్యాంగుల చట్టం అమలులో ఉత్తమ రాష్ట్రం) అవార్డును సాధించడం పట్ల మంత్రి లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యాశాఖ, సమగ్ర శిక్షా దిశానిర్దేశంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగం చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందని ప్రశంసించారు. దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానం, ఇంటర్నెట్ ఆధారిత టూల్స్ ద్వారా సమానమైన విద్యావకాశాలను అందించేందుకు కృషి చేసి అవార్డు సాధించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు,పాఠశాల విద్యాశాఖ,సమగ్ర శిక్షా, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగాన్ని మంత్రి లోకేష్ అభినందించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఏపీ తరఫున అవార్డు అందుకున్న సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావుకి శుభాకాంక్షలు తెలిపారు.

### దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

**- మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. విభిన్న రంగాల్లో ప్రతిభాపాటవాలు చాటుతున్న విభిన్న ప్రతిభావంతులకు మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటోందని తెలిపారు. త్రిచక్ర మోటారు వాహనాలు ఇవ్వటంతో పాటు, ఆర్థిక ఆసరా కూడా అందించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల పింఛన్ రూ.6000కి పెంచాం. దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటాం. అవకాశాలు అందిపుచ్చుకుని దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

చైతన్యరథం

# దివ్యాంగులను వెన్నుతట్టి ప్రోత్సహించాలి

## - నారా భువనేశ్వరి పిలుపు





హైదరాబాద్ (చైతన్యరథం): దివ్యాంగులను ప్రోత్సహిస్తే వారు ఎంతో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్‌టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పిన్నమనేని సాయిబాబా అధ్యక్షత వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భువనేశ్వరి దివ్యాంగులకు దుప్పట్లను, ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ... ఏటా డిసెంబర్ 3వ తేదీన దివ్యాంగుల దినోత్సవంగా జరపాలని ఐక్యరాజ్యసమితి (యుఎన్‌ఏ) జనరల్ అసెంబ్లీ 1992లో ప్రకటించిందన్నారు. దివ్యాంగులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారు జీవితంలో స్థిరపడేందుకు తగు సాయం చేసే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి ఈ డిక్లరేషన్ చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్ల మంది, భారతదేశంలో రెండున్నర కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరిని గుర్తించి ప్రభుత్వాలు రిజర్వేషన్‌లు, పెన్షన్‌లను ఇస్తున్నాయన్నారు. దివ్యాంగులకు కొంచెం సహాయం చేస్తే వారు పెద్దపెద్ద పొజిషన్‌లోకి వెళతారు. అలా వెళ్లిన వారిని నేను స్వయంగా చూశాను. వారిలో చాలా పట్టుదల ఉంటుంది. ధైర్యంగా ముందుకు వెళ్తారు. పుట్టుకతో గానీ, వేరే ఇతర కారణాలతోగానీ అంగ వైకల్యానికి గురైన వారు, మనందరం ఒక్కటే. అందరినీ ఆదరించుకుంటూ మనతోపాటు ముందుకు తీసుకెళ్తే అందరం సుఖసంతోషాలతో జీవిస్తాం. ఎన్‌టీ రామారావు.. మానవ సేవే.. మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని నమ్మారు. దీనిని ఆచరణలో పెట్టడానికి చంద్రబాబు ఎన్‌టీఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. ప్రజలకు ఏది అవసరమో వాటిని అందించడానికి ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా తాము ఎప్పుడూ ముందుంటామని భువనేశ్వరి స్పష్టం చేశారు.

### చంద్రబాబు హయాంలో ఆశ్రమ పాఠశాలలు

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఐక్కని నర్సింహులు మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వం రాక ముందు దివ్యాంగుల కోసం అప్పటి ప్రభుత్వం కేవలం రూ.60 లక్షలు కేటాయిస్తే ఎన్‌టీఆర్ హయాంలో 1985 నుంచి 1989 కాలంలో రూ.16కోట్లు కేటాయించారని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూ.21 కోట్ల 68 లక్షలు కేటాయించారన్నారు. కరీంనగర్, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మూగ, గుడ్డి, చెవిటి వారికి విద్యాబోధన కోసం ఆశ్రమ పాఠశాలలను చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ ట్రస్ట్ తరపున తల్లితండ్రులు లేని తెలంగాణకు చెందిన 600 మంది పిల్లలను చదివించారన్నారు. నారా లోకేష్ ఆలోచన మేరకే పార్టీలో కార్యకర్తల సంక్షేమ నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ప్రజాసేవకే పుట్టిన పార్టీ టీడీపీ

పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ప్రజలకు సేవ చేయాలనే భావంతో పుట్టిన పార్టీ అన్నారు. ఎన్‌టీఆర్ ఇచ్చిన కూడు, గుడ్డ, నీడ అనే నినాదంపై పుట్టిన పార్టీ. దివ్యాంగుల కోసం మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో ఎన్‌టీఆర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు తరువాత ఎన్‌టీఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్‌కు ట్రస్టీగా నారా భువనేశ్వరి ఉండటం అందరి అదృష్టమన్నారు. పదవులు శాశ్వతం కావు, కానీ సేవ శాశ్వతం అన్నారు.

ఎన్‌టీఆర్ ట్రస్ట్ సీఈవో కె.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ... ఎన్‌టీఆర్ ఆశయాలకు అనుగుణంగా 1997లో ఎన్‌టీఆర్ ట్రస్ట్‌ను చంద్రబాబు స్థాపించారన్నారు. అప్పటి నుంచి విద్యా, వైద్యం, స్త్రీశక్తి వంటి రంగాల్లో, విపత్తు సమయాల్లో సేవలు అందించడంలో భువనేశ్వరి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ ట్రస్ట్ ముందుంటోందన్నారు.

పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వాలు టెక్నాలజీని ఉపయోగించి దివ్యాంగులను ఎలా ఆదుకోవాలో పరిశోధన జరగాలన్నారు. తద్వారా భవిష్యత్ తరాలను కాపాడాలన్నారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరముందన్నారు.

రాష్ట్ర పార్టీ నాయకులు సామ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్‌టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు.. ఎన్‌టీఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆశయాలకు నిజమైన వారసురాలుగా నారా భువనేశ్వరి.. ఎన్‌టీఆర్ ట్రస్ట్‌ను ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.

వికాలంగుల కార్పొరేషన్ మాజీచైర్మన్, పిన్నమనేని సాయిబాబా మాట్లాడుతూ... ఎన్‌టీఆర్ ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులపై సానుభూతి చూపకుండా వారికి సహకారం అందించాలని అన్నారు. ట్రై సైకిళ్లను అందించడంలో కందికంటి అశోక్‌కుమార్ గౌడ్, కట్టా వెంకటేష్ గౌడ్ తమ సహకారాన్ని అందించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ ట్రస్ట్ సీహెచ్ గోపి, రాష్ట్ర పార్టీ నాయకులు ఆజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, ఎన్.దుర్గాప్రసాద్, డాక్టర్ ఏ.ఎస్.రావు, పోలంపల్లి అశోక్, కందికంటి అశోక్‌కుమార్ గౌడ్, కట్టా వెంకటేష్ గౌడ్, టి.హరికృష్ణ, సాంబశివరావు, దివ్యాంగుల సంస్థల నాయకులు షణ్ముఖరావు, ఏసు బాబు, రాంచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.




## సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిల్లా కలెక్టర్లకు సమాచారం పంపింది. ఈ నెల 5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా.. తుపాను, భారీ వర్షాల వల్ల వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ జారీ తేదీని త్వరలో వెల్లడిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పులివెందులలో వైసీపీ నేతల రేషన్ మాఫియా

- ఇప్పుడూ వారే వ్యాపారం చేస్తున్నారు
- నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని
- మంత్రి నాదెండ్లకు ఎమ్మెల్సీ భూమిరెడ్డి వినతి

కడప(చైతన్యరథం): గత ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కేంద్రంగా నిలిచింది.. రేషన్ కార్డుదారులకు అందాల్సిన బియ్యం పెద్దఎత్తున పక్కదారి పట్టాయని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. పులివెందుల వైసీపీ రేషన్ స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పులివెందుల అనంతపురం జిల్లా సరిహద్దులలో ఉండడంతో అక్రమ రవాణాకు, బియ్యం నిల్వలకు వీలుగా ఉంటుందని స్మగ్లర్లు అడ్డాగా మార్చుకున్నారు.. 2019 నుంచి గత ప్రభుత్వం కాలంలో ఎవరైతే స్మగ్లింగ్ పాల్పడ్డారో ఇప్పుడు కూడా వారే వ్యాపారం చేస్తున్నారంటే ఎంత శక్తిమంతులో అర్థమ వుతుందన్నారు. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే స్మగ్లర్లు ప్రతినెలా కోటి రూపాయలు అర్జిస్తున్నారు. ముఖ్యంగా సత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన వైసీపీ నాయకుడు మిత్రమనాయుడు, వేంపల్లి మండలానికి చెందిన ఒక వైసీపీ మాజీ ప్రజా ప్రతినిధి, ముదిగుబ్బకు చెందిన



శ్రీరామ్‌నాయక్‌లు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నా రని తెలిపారు. వీరు పులివెందులలోనే కాకుండా కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి కూడా బియ్యాన్ని సేకరించి పులివెందుల కేంద్రంగా వ్యాపారం చేస్తున్నారు. స్మగ్లర్ నాయుడు సేకరించిన రేషన్ బియ్యం నవంబర్ 5న పులివెందులలో విజిలెన్స్ అధికారులు తనిఖీలో దొరికింది. ఆ కేసు విషయమై కూడా పలు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. 2022 ఫిబ్రవరి 12న వేంపల్లిలో వైసీపీ నాయకుడిపై కూడా ఈ స్మగ్లింగ్‌పై 120బీ కేసు కూడా నమోదు చేయడం జరిగిందని వివరించారు. పులివెందుల నుంచి అనంతపురం జిల్లాకు ఉన్న సరిహద్దులలో నిఘా పెంచి రైస్ మిల్లులు, గోడౌన్లలో తనిఖీలు నిర్వహించి అందుకు సహకరిస్తున్న అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# కాలంతో పరిగెత్తాలి!

- పోలవరం పనుల్లో గంట కూడా వృధా కాకూడదు
- రెండోవారంలో పోలవరం ప్రాజెక్ట్ షెడ్యూల్ విడుదల
- వాటర్ పాలసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం
- సమావేశ వివరాలు వెల్లడించిన జలవనరుల మంత్రి నిమ్మల
- వాళ్లేవుంటే.. వెలిగొండపై ఆశలు వదిలేసేవాళ్లం..
- జగన్, అంబటిపై మంత్రి నిమ్మల సెటైర్లు
- ప్రతి బిందువును ఒడిసి పట్టేలా వాటర్ పాలసీ: నిమ్మల




అమరావతి (చైతన్య రథం): పోలవరం ప్రాజెక్ట్ పనుల్లో ఒక్క గంట, ఒక్కరోజు కూడా వృధాకాకుండా షెడ్యూల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్టు మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్ట్, హంద్రీ-నీవా ప్రాజెక్టులతోపాటు, వాటర్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారన్నారు. డిసెంబర్ రెండోవారంలో పోలవరం ప్రాజెక్టును సందర్శించి అక్కడే ప్రాజెక్టు పనులకు సంబంధించిన భవిష్యత్ షెడ్యూల్‌ను సీఎం విడుదల చేస్తారన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల పునఃప్రారంభంపై గత ఐదు నెలలుగా కసరత్తు చేస్తోన్న ఇరిగేషన్ శాఖ, సాంకేతిక అడ్డంకులను అధిగమించి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. గత నెలలో మూడు రోజులపాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, సిడబ్ల్యుసి, పిపిఎ, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. ఈ మూడు రోజుల వర్క్‌షాప్‌లో డయాఫ్రం వాల్, ఈసిఆర్‌ఎఫ్ డిజైన్లు, నిర్మాణంపై చర్చ జరిగిందని, ఇప్పటికే డిజైన్లకు సంబంధించి సూత్రప్రాయంగా సెంట్రల్ వాటర్ కమిషన్ అంగీకారం తెలిపిందని వివరించారు. జనవరి నుంచి డయాఫ్రం వాల్ పనులు, తరువాత ఈసిఆర్‌ఎఫ్ డ్యాం పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారన్నారు. రెండు ప్రధాన నిర్మాణాలు సమాంతరంగా చేపట్టేందుకు ఇప్పటికే సాంకేతిక అనుమతి లభించిందని మంత్రి వివరించారు. ఈ నెలలోనే ఈసిఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పనులు పూర్తవుతాయని వివరించారు.

ఇక ప్రాజెక్టులో కీలకమైన పునరావాస పనుల్లో జీవో నెంబర్ 35ను అమలు చేసి త్వరితగతిన కాలనీల నిర్మాణం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. పునరావాసంలో పెండింగ్ పనులు, ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లోవున్న రూ.996 కోట్లు వెంటనే విడుదలకు సీఎం అంగీకరించారన్నారు. ప్రాజెక్టుకున్న అంతర్రాష్ట్ర సమస్యలను, ఒరిస్సా మరియు చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరించి, ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయమని సీఎం సూచించినమట్టు మంత్రి నిమ్మల చెప్పారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి జలాలను, ఇటు ఉత్తరాంధ్ర, అటు రాయలసీమకు తీసుకెళ్తామని వివరించారు నిమ్మల.

## డిసెంబర్ నుంచే హంద్రీనీవా..

రాయలసీమకు సాగు, తాగు నీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను డిసెంబర్‌లో తిరిగి ప్రారంభించేలా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారన్నారు. ప్రధాన కాల్వ పూర్తి సామర్థ్యం 3850 క్యూసెక్కులకు పెంచేందుకు వీలుగా లైనింగ్ పనులతో పాటు, విస్తరణ పనులు చేపడతామని వివరించారు.

## వైసీపీ హయంలో చింతలపూడి విధ్వంసం

రెండు ఉమ్మడి జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు సాగు నీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పర్యావరణ అనుమతుల విషయంలో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. మూడు నెలల్లో ఈసీ తీసుకోమని 2022లో సుప్రీం కోర్టు చెప్పినా, గత ప్రభుత్వం తీసుకోలేదని స్పష్టం చేశారు. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకమైందన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీరందించే ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుళ ప్రయోజనకారి చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభించేందుకు అడ్డంకిగావున్న న్యాయపరమైన సమస్యలు పరిష్కరించి, పనులు ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు మంత్రి నమ్మల తెలిపారు.

## వాళ్లేవుంటే వెలిగొండ ఎప్పటికయ్యేదో?

అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాకు జీవనాడి వెలిగొండ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు పనులు కూడా ఈనెలనుంచే ప్రారంభించి 2026 జూన్‌నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. చంద్రబాబులాంటి కష్టపడే వ్యక్తి ఉంటేనే వెలిగొండ పూర్తవ్వడానికి ఇంకా రెండేళ్లు పడుతుందని తెలిపారు. అదే జగన్‌గానీ, అంబటి రాంబాబుగానీ ఉండివుంటే వెలిగొండ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం అనేవాళ్ళని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు.

## ప్రతి నీటి బొట్టూ ఒడిసి పట్టేలా వాటర్ పాలసీ

ఆంధ్రప్రదేశ్‌ను కరవురహిత రాష్ట్రంగా మార్చేందుకు సీఎం సూచనలమేరకు వాటర్ పాలసీ రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు. దీని ద్వారా ప్రతి నీటి బొట్టూ ఒడిసిపట్టి, ప్రతి ఎకరాకూ నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఏడాదికి రెయిన్ ఫాల్, రివర్ ఇన్ ఫ్లో ద్వారా మొత్తం 11 వేల టీఎంసీ వచ్చాయని పేర్కొన్నారు. ఇరిగేషన్, డ్రింకింగ్ వాటర్, ఇండస్ట్రీస్‌కి కలిపి 954 టీఎంసి వాడకం జరుగుతోందన్నారు. మనకు వివిధ రూపాల్లో అందుబాటులోకి వస్తున్న నీటి వనరుల్లో కనీసం 10శాతం కూడా మనం ఉపయోగించుకోవడంలేదని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించి సమగ్ర ప్రణాళికతో నీటి వనరుల సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో వాటర్ పాలసీ రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం అనేది గేమ్ ఛేంజర్ కాబోతుందని మంత్రి అన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే గోదావరి-పెన్నా నదుల అనుసంధానంపై సమగ్ర కసరత్తు చేస్తోందని వివరించారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నీటిని బనకచర్లకు తీసుకెవళ్ళడం ద్వారా రాయలసీమ అవసరాలను పూర్తిగా తీర్చవచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

## రెండోవారంలో పోలవరానికి ముఖ్యమంత్రి

### వర్క్స్ షెడ్యూల్ ప్రకటించేది అక్కడే.. అప్పుడే

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరాన్ని యజ్ఞంలా చేపట్టి 2027కి పూర్తిచేసేలా సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మంగళవారం వాటర్ పాలసీని సమీక్షించిన సీఎం.. ఈమేరకు జలవనరుల విభాగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. డిసెంబర్ రెండోవారంలో పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న సీఎం.. అదేరోజు పోలవరం వర్క్ టైమ్ షెడ్యూల్ విడుదల చేస్తారు. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత సమయం వృథా చేయకుండా కాలంతో పరిగెత్తాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన ఐదు నెలల కాలంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై పూర్తిస్థాయి అవగాహనతో షెడ్యూల్ విడుదల చేయడానికి ఉపక్రమించడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఒక్కొక్క సాంకేతిక సమస్యను అధిగమిస్తూ.. ప్రాజెక్టుల డిజైన్లకు సూత్రప్రాయంగా అనుమతులు సాధించారు. పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించిన రూ.996 కోట్ల పెండింగ్ నిధుల విడుదలకూ సీఎం ఆదేశాలు జారీ చేశారు. పోలవరం విషయంలో చత్తీస్‌గడ్, ఒరిస్సా ప్రభుత్వాలతో చర్చించి అంతర్రాష్ట్ర సమస్యలకు చెక్ పెట్టాలని, పోలవరం ఫలాలు రాయలసీమ, ఉత్తరాంధ్రకు అందేలా చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

## వక్ఫ్‌బోర్డుపై నీలి మీడియా దుష్ప్రచారం సిగ్గుచేటు

- నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు
- ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ ఆగ్రహం



అమరావతి(చైతన్యరథం): గత ప్రభుత్వం హయాంలో నియమించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీ నియామకాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఉపసహరించుకుంటే వక్ఫ్ బోర్డునే రద్దు చేశారని బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేయడాన్ని ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ తీవ్రంగా ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర వర్ఫ్‌బోర్డు కమిటీ నియ మిస్తూ నవంబర్ 2023న జారీ చేసిన జీవో ఎంఎస్ నెం.47 అమలుకు నోచుకోకుండా హైకోర్టు స్టే విధించిందని తెలిపారు. రెండేళ్లుగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు పాలకవర్గం లేకుం డా పోవడంతో ఇబ్బందులు పడిన విషయం వాస్తవం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వక్ఫ్ బోర్డుకు తనకు నచ్చిన వారితో పాలకవర్గాన్ని నియమించుకునే అధికారం, హక్కులకు అనగు ణంగా జీవో 75ను జారీ చేసిందన్న విష యాన్ని మరిచిపోయి బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమె త్తారు. వక్ఫ్ చట్టంలోని నిబంధనలకు నాటి వైసీపీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి ఇష్టా రాజ్యంగా నియమించిందని మండిపడ్డారు. దాంతో వక్ఫ్‌బోర్డు కమిటీ చెల్లుబాటును సవాల్ చేస్తూ న్యాయస్థానంలో పిటిషన్ ఉన్న విషయాన్ని కూడా అసత్య ప్రచారం చేసే వారు గుర్తించుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడటాన్ని సహించేదిలేదని స్పష్టం చేశారు.

## ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

- వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- టీడీపీ కేంద్ర కార్యాలయం వేడుకల్లో నేతలు

మంగళగిరి(చైతన్యరథం): ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళ వారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు,ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు సునీల్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర బాబు, నేతలు మద్దిరాల ఇమ్మానుయేల్, కనపర్తి శ్రీనివా స్ తదితరులు అన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లా డుతూ విభిన్న ప్రతిభావంతుల ను ప్రోత్సహించి వారి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారికి చేయూతనిచ్చి సమాజంలో మంచి గౌరవం దక్కేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభు త్వం కట్టుబడి ఉందని తెలిపారు. మనో ధైర్యంతో ముందడుగు వేసి వారు అన్ని రంగా ల్లో సత్తా చాటుకోవాలని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందడుగు వేయాలని సూచించారు.



# విలీనానంతర సమస్యల పరిష్కారానికి చర్యలు



- రుణభారం తగ్గించే దిశగా కార్యాచరణ
- అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు
- ఆదాయం పెంపుపై దృష్టి సారించాలి
- ఆర్టీసీ అధికారులకు రవాణా మంత్రి మండిపల్లి ఆదేశం

అమరావతి (చైతన్యరథం): గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చేతులు దులుపుకుందని, విలీనానంతర సమస్యలను పట్టించుకోలేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆక్షేపించారు. విలీనానంతర సమస్యల పరిష్కారానికి కార్యచరణ సిద్ధంచేయాలని అధికారులను అదేశించారు. సిబ్బంది, సంస్థ నిర్వహణలో సరైన విధివిధానాలు అవలంబించాలని సూచించారు. అవసరాలకు అనుగుణంగా నూతన బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీపై రుణ భారం తగ్గించే దిశగా కార్యాచరణ రూపొందించాలన్నారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. టిక్కెట్(కోర్) రాబడి, నాన్-టిక్కెట్ (నాన్-కోర్) ఆదాయాన్ని మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయాన్ని పెంచుకోవడానికి బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో, ఇతర వాణిజ్య ప్రాజెక్టుల కోసం ఉపయోగించాల్సిన భూముల వివరాలపై చర్చించారు. ఈ ప్రాజెక్ట్‌లకు సంబంధించి ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన వాణిజ్య ప్రతిపాదనలు/ అభివృద్ధి పనుల వివరాలు, వాటపై ప్రతిపాదిత కార్యాచరణ ప్రణాళికల పైన వివరాలు తెలుసుకున్నారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు, స్క్రాపింగ్ కోసం గుర్తించిన పాత బస్సుల వేలం విధానంలోని నిబంధనలపై చర్చించారు. అద్దె బస్సుల ఆదాయం మెరుగుపరచడం, సర్వీసుల పెంపుదల, కొత్త అద్దె బస్సులు ప్రవేశ పెట్టే అంశాలపై సమీక్షించారు. అసోసియేషన్ల ద్వారా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటం పై చర్చించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్ పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్లకు విధులతో పాటు నిధులూ కేటాయింపు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం): బీసీ కార్పొరేషన్లకు విధులతో పాటు నిధులూ కేటాయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను మంగళవారం ఎమ్మెల్యే అరవింద్‌బాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వెంకట గురుమూర్తి సహా బీసీ సంఘాల నాయకులు కలిశారు. ఈ నెల ఆరో తేదీన కృష్ణాజిల్లా అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో జరగనున్న తనఆత్మీయ అభినందన సభకు హాజరుకావాలని మంత్రి సవితను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు కోరారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ,అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావును అభినందించారు. టీడీపీ ఆది నుంచి బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు. బడుగు, బలహీనవర్గాల వారికి రాజ్యాధికారం కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. జగన్‌పాలనలో బీసీ కార్పొరేషన్లన్నీ నిర్వీర్యమయ్యాయన్నారు. వైసీపీ నేతలకు రాజకీయ ఉపాధి కల్పించడానికే జగన్ బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించారన్నారు. కేవలం పదవులు మాత్రం కట్టబెట్టి, నిధులు కేటాయించలేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తన పాలనా కాలంలో బీసీల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. ఇటీవల బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించమే కాకుండా నిధులు సైతం కేటాయించారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.39వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారన్నారు.బీసీల అభివృద్ధి పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ నిధుల కేటాయింపే నిదర్శనమన్నారు. వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్పొరేషన్ల చైర్మన్లు పాపారావుకు, వెంకట గురుమూర్తికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దేవుళ్ల మురళి, కేసన శంకరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆ షిప్‌లోకి బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో తేలుస్తాం

- కాకినాడ కలెక్టర్ స్పష్టీకరణ

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ పోర్టులో ఉన్న స్టెల్లా షిప్ లోకి రేషన్ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో, ఎలా వచ్చాయో తేలుస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ స్పష్టం చేశారు. ఏ గోదాం నుంచి బియ్యం వచ్చాయో పరిశీలిస్తామని చెప్పారు. షిప్‌లో బియ్యం మొత్తం పేదల బియ్యమేనా అనేది కూడా చూస్తామని తెలిపారు. కాకినాడలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యులతో విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని షాన్ మోహన్ చెప్పారు. ఈ బృందంలో రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల శాఖ, కస్టమ్స్, పోర్టు అథారిటీ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి లోడ్ ను పరిశీలించి... బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో విచారిస్తామని చెప్పారు. తనిఖీలకు విధివిధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఎవరైనా 7993332244 నంబర్ కు ఫోన్ చేసి వివరాలు అందిచవచ్చని చెప్పారు.

# అతి పిన్న వయసులో అరుదైన గౌరవం

## 36 ఏళ్లకే.. పార్లమెంట్ తొలి వరుసలో..!

- రామ్మోహన్ నాయుడి ఘనత



న్యూ ఢిల్లీ (చైతన్యరథం): అతి పిన్న వయసులోనే పార్లమెంటులో ముందు వరుసలో కూర్చునే అరుదైన గౌరవాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ రికార్డు ఆయన తండ్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరు మీద ఉండగా దీనిని రామ్మోహన్ నాయుడు తిరగరాశారు. కేంద్ర కేబినెట్‌లో ముఖ్యమైన శాఖలకు మాత్రమే దక్కే ఈఘనత తనకు దక్కడం పట్ల ఆయన స్పందించారు. తెలుగు వారికి,శ్రీకాకుళం ప్రజలకు దక్కిన గౌరవంగా ఆయన దీనిని అభివర్ణించారు.

## మా వియ్యంకుడి వ్యాపారానికి

# రేషన్ బియ్యంతో సంబంధం లేదు

- అనుమానం ఉంటే తనిఖీ చేసుకోవచ్చు
- పేర్ని నాని విమర్శలను తిప్పికొట్టిన మంత్రి పయ్యావుల



అమరావతి (చైతన్యరథం): రేషన్ బియ్యంతో తన వియ్యంకుడి వ్యాపారానికి ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. బియ్యం రవాణాకు సంబంధించి మంత్రి కేశవ్ వియ్యంకుడిపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి పయ్యావుల స్పందిస్తూ పేర్ని నాని విమర్శలను గట్టిగా తిప్పికొట్టారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పయ్యావుల మాట్లాడుతూ.. మా వియ్యంకుల కుటుంబం మూడు తరాలుగా బాయిల్డ్ రైస్ ఎగుమతి వ్యాపారం చేస్తున్నారు. ముడి బియ్యం వ్యాపారం చేయరు.. స్టీమ్డ్ రైస్ మాత్రమే ఎగుమతి చేస్తారు. రేషన్ బియ్యంతో నా వియ్యంకుడి వ్యాపారానికి సంబంధం లేదు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి సొంత ఫ్యాక్టరీలో మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనే తన వియ్యంకులు వ్యాపారం చేస్తున్నారని... ఏపీలో గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబుకు అనుమానం ఉంటే చెక్‌పోస్ట్ పెట్టుకుని ప్రతి బ్యాగ్‌ను తనిఖీ చేసుకోవచ్చని, అందుకు తానే అనుమతులు ఇప్పిస్తానన్నారు. వాళ్లు చేసేది పారా బాయిల్డ్ రైసు వ్యాపారం మాత్రమే అని మంత్రి స్పష్టంచేశారు.అలాగే గతఐదేళ్లలో ఇసుక, మద్యం, బియ్యంలో అనేక అవకతవకలు జరిగాయని.. వాటిని సరిచేస్తున్నామన్నారు. దీనిపై కేబినెట్‌లో చర్చించినట్లు తెలిపారు. గతంలో జరిగిన తప్పుడు విధానాలను సరిదిద్దుతున్నట్లు చెప్పారు.

కాగా.. ఇటీవల కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణా చేస్తున్న షిప్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనిఖీ చేసిన విషయం తెలిసిందే. పవన్ తనిఖీల పై మాజీ మంత్రి పేర్ని నాని విమర్శిస్తూ, మంత్రి పయ్యావుల వియ్యంకులపైనా పలు ఆరోపణలు గుప్పించారు.

# 9న విశాఖ డెయిరీకి సభా సంఘం

**అక్రమాలపై విచారణ**



అమరావతి (చైతన్యరథం): ఈనెల 9న విశాఖ డెయిరీని సందర్శించాలని సభా సంఘం నిర్ణయించింది. విశాఖ డెయిరీలో అక్రమాలు, అవినీతిపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన సభా సంఘం ఏర్పాటయిన విషయం తెలిసిందే. ఈ సభా సంఘం మంగళవారం సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ఈ నెల 9న విశాఖ డెయిరీని సందర్శించాలని సభా సంఘం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సంఘం చైర్మన్ జ్యోతుల నెహ్రూ తెలిపారు. అదే రోజు సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై వివరాలు తెలుసుకుంటామన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం.. రైతుల సంక్షేమం వదిలి సొంత లాభం చూసుకుంటోందనే ఆరోపణలు, ఇతర అభియోగాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. విచారణ ఏ విధంగా ప్రారంభించాలనే అంశంపై ప్రాథమికంగా చర్చించామని తెలిపారు. సభా సంఘం విచారణకు విశాఖ డెయిరీ ఎండీ, ఆర్థిక లావాదేవీలు చూసే అధికారులు రావాల్సి ఉంటుందన్నారు.కంపెనీస్ యాక్ట్ పై అవగాహన ఉన్నవారిని కూడా మాబృందంలో చేర్చుకుంటామని తెలిపారు. పాడి రైతులు నష్టపోకూడదనే కోణంలోనే మా సిఫార్సులు ఉంటాయని స్పష్టం చేశారు. కాగా సభా సంఘం సభ్యుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే డెయిరీలో అవకతవకలు జరగాయనే ఆరోపణలున్నాయన్నారు. విశాఖ డెయిరీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నష్టనివారణ చర్యలు తీసుకుంటామన్నారు.ట్రస్ట్ నిధుల మళ్లింపు పైనా సమగ్ర నివేదికను సభ ముందు ఉంచుతామని తెలిపారు.

### సూటిగా.. గణాంకాలతో..

# ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలకు పెమ్మసాని ధీటైన జవాబు

- తన శాఖలో అడిగిన వాటిపై సవివరంగా సభ ముందు..
- పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో గుంటూరు గళం
- తమిళనాడు, పశ్చిమబెంగాల్ నాయకుల నోట మాట రాలేదు



అమరావతి(చైతన్యరథం): పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష నాయకుల ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి,కమ్యూనికేషన్స్‌శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధీటైన సమాధానమి చ్చారు. ఉపాధి హామీ పథకం నిధుల కేటాయింపులు, ఎన్డీయే పాలనలో జరుగుతున్న అభివృద్ధి, గ్రామమీణాభివృద్ధి శాఖకు కేటాయిస్తున్న నిధులను గణాంకాలతో సభ ముందు ఉంచడంతో విస్తుపోవడం వారి వంతయింది. ఒకానొక దశలో తరు వాత ప్రశ్న ఏం అడగాలా? అన్న ఆలోచనలో పడిపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే సీనియర్ నాయకుల ప్రశ్నాస్త్రాలకు ఒంటిచేత్తో సమా ధానమిచ్చి గుంటూరు మిర్చి ఘాటును రుచిచూపారు. కేరళకు చెందిన అలప్పుజ కాంగ్రెస్ ఎంపీ కె.సి.వేణు గోపాల్, తమిళనాడు పెరంబదూర్ లోక్‌సభకు చెందిన డీఎంకే ఎంపీ టి.ఆర్ .బాలు, తిరువల్లూరుకు చెందిన కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్, హిమాచల్‌ప్రదేశ్ కు చెందిన ఎంపీ అనురాగ్ సింహ్ ఠాకూర్ వంటి హేమాహేమి సీనియర్ నాయకులు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి ప్రశ్నాస్త్రాలు సంధించారు. పెమ్మ సాని స్పందిస్తూ గణాంకాలతో ఉన్నది ఉన్నట్లు సంక్షి ప్తంగా వివరించారు.

**ఉపాధి హామీకి ఎన్నడూ లేని విధంగా ఖర్చు**

తమిళనాడుకు చెందిన పార్లమెంట్ సభ్యుడు టి.ఆర్.బాలు మాట్లాడుతూ ఏడాదికేడాది ఉపాధి హామీ నిధులు తగ్గించేస్తూ ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఏం చెప్పదలుచుకుందో వివరించాలని కోరారు.దీనికి పెమ్మ సాని సమాధానమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2006-07 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమావేశంలో రూ.11వేల కోట్లను కేటాయించారు. అధికారం నుంచి దిగిపోయే సమయానికి రూ.33 వేల కోట్లు బడ్జెట్ ను కేటాయించింది.ఎన్డీయే ప్రభుత్వం ఆగమనం తరువాత ఆ కేటాయింపులను రూ.87వేల కోట్ల వరకు తీసుకు వెళ్లింది. 2021లో రూ.61వేల కోట్ల అంచనాలతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అనంతరం కరోనా మహమ్మారి వ్యాప్తి తరువాత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మరో రూ.50వేల కోట్లను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఏకం గా రూ.1.10 లక్షల కోట్ల నిధులను ఖర్చు చేసింది. అనంతరం పలు రాష్ట్రాల వినతుల మేరకు రివైజ్డ్ బడ్జెట్ కింద మరో రూ.10-20వేల కోట్లను అదనంగా అదే ఏడాదిలో కేటాయించడం ఎన్డీయే ప్రభుత్వానికి చెందుతుందని ఆ బడ్జెట్లో ప్రవేశపెట్టిన రివైజ్డ్ గణాం కాల వివరాలను వివరించారు. అలాగే ఎన్డీయే ప్రభు త్వం హయాంలో కనీస వేతనం రూ.110లకు పడి పోయిందన్న బాలు విమర్శలకు పెమ్మసాని ధీటుగా స్పందించారు."యూపీఏ ప్రభుత్వం ఉండగా రూ.100 లను కనీస వేతనంగా చెల్లించింది. అయితే ఎన్డీయే వచ్చిన తరువాత ఆ వేతనాన్ని సీపీఐ ప్రకారం ప్రతి ఏడాది 7 శాతం పెంచుతూ ఇప్పటివరకు 43 శాతం వరకు పెంచింది. ఎన్డీయే హయాంలో రూ.100లకు తగ్గుతుందని చెప్పడం పూర్తిగా అవాస్తవమని సమాధా నమిచ్చారు. అలాగే ఉపాధి హామీ నగదును సరైన సమయానికి ఇవ్వడం లేదని మాట్లాడడం కూడా సరి కాదు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నగదు పంపిణీ అనేది ఒక డైనమిక్ వేలో జరుగుతున్న ప్రోగ్రాం. రూ.230 కోట్లను ఖర్చుపెట్టి నోడల్ అకౌంట్స్ లేదా వ్యవసాయ కూలీల బ్యాంకుఖాతాలకు పంపించబోతున్నాం. ఇప్పటి దాకా కేవలం రూ.700కోట్లు మాత్రమే పెండింగ్ ఉంది. అవన్నీ దశల వారీగా జమ అవుతూనే ఉంటా యని పెమ్మసాని చెప్పారు.

**అనుకున్న దానికంటే ఎక్కువగానే నిధుల కేటాయింపు**

కాంగ్రెస్ ఎంపీ సెంథిల్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ తగ్గుతూ వస్తుందని, దాని పర్యవసానం ఆ పథకం మరుగునపడే అవకాశం ఉందని వ్యాఖ్యానించగా పెమ్మసాని వివరణ ఇస్తూ "ప్రతి ఏడాది శాఖకు చెందిన రాష్ట్ర, కేంద్ర కార్యదర్శులు చర్చించుకుని, గత ఏడాది పనులను పరిశీలించి రాబోయే బడ్జెట్ అంచనాలు సిద్ధం చేస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో 20 కోట్ల జనాభాకు రూ.10 వేల కోట్లను రాష్ట్రం అడిగింది. అలాగే తమిళనాడులో 7 కోట్ల జనాభాకు రూ.10 వేల కోట్లను అడిగింది. రెండు రాష్ట్రాలలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి గత సంవత్సరం బడ్జెట్ కంటే రూ.500 కోట్లను అదనంగా అడగగా, తమిళనాడు మాత్రం గత సంవత్సర బడ్జెట్ కంటే రూ.2500 కోట్లను అధికంగా అడిగింది. అయినప్పటికీ స్పందించిన ప్రధానమంత్రి మోదీ ఆమోదించి తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు అడిగిన విధంగా బడ్జెట్‌ను కేటా యించారని వివరించారు.

**జాబ్ కార్డుల రద్దు రాష్ట్రాల బాధ్యత**

అనంతరం జాబ్ కార్డుల రద్దు అంశంపై ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా పెమ్మసాని బదులిస్తూ జాబ్‌కార్డు రద్దు అనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉండదు..అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో జరుగుతుందని చెప్పారు. అవి పూర్తిగా కొన్ని కారణాలపై ఆధారపడి ఉంటాయని వివరించారు. నకిలీ ధృవపత్రాలు, బోగస్ దరఖాస్తుదారులు ఒక పంచాయతీ నుంచి మరో పంచాయతీకి వలసలు, ఆయా గ్రామాలు పట్టణీకరణం చెందినప్పుడు లేదా సంబంధిత వ్యక్తి మరణించడం వంటి కారణాల వల్ల జాబ్ కార్డ్ అనేది రద్దు చేయబడుతుందని తెలిపారు.

**గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయింపుల్లో 57 శాతం**

మరో ఎంపీ కె.సి.వేణుగోపాల్ పార్లమెంట్‌ను ప్రశ్నిస్తూ జాబ్ కార్డ్ రద్దు పేరుతో 4.5 కోట్ల కార్డులను రద్దు చేయడం వల్ల ఎన్ని కుటుంబాలు నష్టపోయాయో తెలుసా? ఈ రద్దుకు ఆధార్ సీడింగ్ కార్డు కూడా ఒక కారణం అయిందా? యావత్ బడ్జెట్ కేటాయింపుల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి ఎంత కేటాయిస్తున్నారు? అని అడిగారు. ఆ ప్రశ్నకు దీటుగా స్పందించిన పెమ్మసాని గారు "ఆధార్ సీడింగ్ వల్ల జాబ్ కార్డు రద్దు అవడం జరగదు. పైగా దీనివల్ల లబ్దిదారులకు వారి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ కావడానికి దోహదపడుతుంది. కార్డు రద్దు గురించి చెప్పాలంటే ఇంతకు మునుపు నేను చెప్పిన పలు కారణాల వల్ల తప్ప కార్డు రద్దులో కేంద్ర ప్రభుత్వం ప్రమే యం ఉండదు అని మరోసారి ఆయన గుర్తు చేశారు. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జె ట్ కేటాయింపులో పథకం కోసం ఎంత శాతం నిధులను కేటాయిస్తున్నారని, 1.43 కోట్ల జాబ్ కార్డులను రద్దు చేశారని వేణుగోపాల్ విమర్శించే ప్రయత్నం చేశారు. దీనికి స్పందిస్తూ కేటాయింపుల్లో 57 శాతం నిధులను ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్నా మని పెమ్మసాని సమాధానం ఇచ్చారు. అలాగే 2023 - 24 సంవత్సరానికి 20లక్షల కార్డులు అదనంగా నమోదైనట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని వివరించారు.

# దొంగ రిజిస్ట్రేషన్లు, భూ ఆక్రమణలు





- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ, కుడుపూడి సత్తిబాబు
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

మంగళగిరి(చైతన్యరథం): ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఏపీ శెట్టి బలిజ కార్పొరేష న్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అధికారు లతో ఫోన్లలో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పలువురికి ఎమ్మెల్యే యార్లగడ్డ ఆర్థిక సాయం అందించారు.

- బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన ఒంటెల పేరయ్య సమస్యను వివరిస్తూ తన భూమిని ఆక్రమించి సాగుచేసుకోనివ్వ కుండా తనపై దాడులకు దిగుతున్నారని. భూమిని విడిపించి తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశాడు.

- రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్లు, సూపర్ వైజర్ల సమస్యలను పరిష్కరించి తమను ఏజెన్సీ వ్యవస్థ నుంచి తప్పించి మునిసిపాలిటీ పరిధిలోకి తెచ్చి తమకు వేతనాలు చెల్లించాలని పలువురు క్లాప్ ఆటో డ్రైవర్లు గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.

- నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామంలోని తమ భూమికి రిటైర్డ్ తహసీల్దారు ద్వారా దొంగ సంతకాలతో పాస్ పుస్తకాలు పుట్టించుకుని రాంబాబు అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని అదే గ్రామానికి చెందిన ఇరగదిండ్ల దేవమ్మ ఫిర్యాదు చేశారు. దొంగ పాస్ పుస్తకాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

- కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం రెవెన్యూ పరిధిలో తన పుట్టింటి వారు తనకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన భూమిని అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని అవుల వేణుకుమారి ఆవేదన వ్యక్తం చేసింది. తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విన్నవించుకుంది.

- రెవెన్యూ రికార్డులను పరిగణలోకి తీసుకోకుండా వ్యవసాయ భూమిని వ్యవసా యేతర భూమిగా మార్చి తన భూమిని మరొకరికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికా రులపై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన మూల్పూరు వెంకట లక్ష్మీప్రసాద్ ఫిర్యాదు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు.

- తమ దాయాదులు తమ భూమికి తప్పుడు కాగితాలు సృష్టించుకుని తన భూమి లో తనను ఇళ్లు నిర్మించుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం కనుమల చెరువు గ్రామానికి చెందిన గుమ్మా వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకుని తనకు ఇబ్బంది లేకుండా చూడాలని విన్నవించారు.



# చదువుతోనే సమాజంలో పేదరికం అంతం

- విద్యకే ఎన్డీయే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత
- గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు
- మంత్రి డోలా స్పష్టీకరణ
- నెల్లూరు జిల్లా బోగోలు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి



నెల్లూరు (చైతన్యరథం): చదువుతోనే సమాజంలో పేదరికం అంతమవుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం విద్యకే మొదటి ప్రాధన్యతనిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పేదల విద్యకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. మంగళవారం రాత్రి.. నెల్లూరు జిల్లా బోగోలు అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించిన మంత్రి పారిశుద్ధ్య నిర్వహణ లేమి, లైట్లు వెలగకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. గతంలో ఇదే పాఠశాలలో ఓ విద్యార్థినిని పాము కరిచిన ఘటన పట్ల మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. పాఠశాల పక్కనే ఉన్న నీటికుంటను వెంటనే పూడ్చివేయాలన్నారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని సిబ్బందికి మంత్రి సూచించారు.

**దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది**

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగుల హక్కులను కాపాడడంతో పాటు వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత 5 ఏళ్ళుగా వైసిపి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. దివ్యాంగుల ఫించన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదే అన్నారు. దివ్యాంగుల పాఠశాలలు, వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. విశాఖలో దివ్యాంగుల స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దివ్యాంగ విద్యార్థులకు బ్రెయిలీ పుస్తకాలను విద్యా సంవత్సరం మొదటిలోనే ఇస్తాం. దివ్యాంగులకు త్రీ వీలర్స్, పరికరాలు అందిస్తాం. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా

# సౌదీలో చిక్కుకున్న సిక్కోలు యువకులను స్వదేశానికి రప్పించండి

**- విదేశాంగ మంత్రి జైశంకర్‌కు రామ్మోహన్‌నాయుడు వినతి**



ఢిల్లీ (చైతన్యరథం): శ్రీకాకుళం నుంచి ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వలస వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన 22 మంది యువకులను స్వదేశానికి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విదేశాంగ మంత్రి జై శంకర్‌కు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు. బతుకుతెరువు కోసం సౌదీ అరేబియా దేశానికి వెళ్లిన యువకులు.. ఏజెంట్లు, యాజమాన్యం చేతులో మోసపోయి అక్కడ అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాంతో పాటు ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన దాదాపు 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి అక్కడ చిక్కుకుపోయారు. రెండు నెలలు పని చేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడంతో, గత కొద్ది రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కార్మికులను సౌదీ అరేబియా నుంచి క్షేమంగా స్వదేశానికి తీసుకు వచ్చేందుకు చొరవ చూపాలని జైశంకర్‌ను మంగళవారం రామ్మోహన్‌నాయుడు కలుసుకొని వినతిపత్రం అందించారు. ఈ మేరకు సౌదీలోని భారత ఎంబసీకి సమాచారం అందించి, వారి బాగోగులను చూడాలని కోరామని తెలిపారు.

## స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు చర్చలు

**- మంత్రి అచ్చెన్నాయుడు**



అమరావతి (చైతన్యరథం): సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకులను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు చెందిన 22 మంది యువకులు ఉపాధి కోసం వెళ్లి సౌదీ అరేబియాలో చిక్కుకున్నారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోయిన యువకులను తిరిగి సొంత ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడుతో ఈ అంశంపై చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో పరిశ్రమల అభివృద్ధి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు.

## స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి (చైతన్యరథం): సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లా యువకులను తిరిగి సొంత ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఏపీ ఎన్ఆర్‌టీ విభాగం ద్వారా సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఇన్చార్జ్ మంత్రి హోదాలో స్థానిక జిల్లా కలెక్టరును అప్రమత్తం చేశాం. జిల్లా కలెక్టరును విదేశాంగ శాఖ ఉన్నతాధికారులతో ఈ విషయంపై సంప్రదింపులు జరపాల్సిందిగా ఆదేశాలు ఇచ్చాం. బాధితుల బంధువులు ఆందోళన చెందవద్దు. వారిని త్వరగా ఇంటికి తీసుకొస్తాం. మా కార్యాలయం ద్వారా సౌదీ అరేబియాలోని తెలుగు సంఘాలతో సంప్రదింపులు జరిపి వారు క్షేమంగా ఉండేలా, వారికి భారత ఎంబసీ ద్వారా భోజనాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

మా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు విదేశాంగ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ అంశంపై చర్చించి తగు చర్యలు తీసుకుంటున్నాం. వీలైనంత త్వరగా వారిని స్వస్థాలకు తీసుకువస్తాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తాము. ఎన్డీయే ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధికి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు.

# అగ్నిలో అవినీతి

**సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌పై వేటు**

- ఫైర్ డీజీగా ఉన్నప్పుడు రూ. కోటి దుర్వినియోగం
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక
- సస్పెండ్ చేసిన ప్రభుత్వం



అమరావతి (చైతన్యరథం): ఏపీ సీఐడీ విభాగం మాజీ అధిపతి, ఐపీఎస్ అధికారి ఎన్. సంజయ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన సమయంలో ఆ అధికారిక హోదాను అడ్డం పెట్టుకుని కోటి రూపాయల దుర్వినియోగానికి పాల్పడినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తేల్చింది. సౌత్రిక టెక్నాలజీస్ అండ్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో కుమ్మక్కైనట్లు నిర్ధారించింది. పనుల్లో పురోగతి లేకుండానే భారీ చెల్లింపులు చేసినట్లు గుర్తించింది.

ఆయన బిడ్ రిగ్గింగ్, టెండర్లు కట్టబెట్టడంలో పక్షపాతానికి, విశ్వాతఘాతుకానికి పాల్పడినట్లు తేల్చింది. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ నివేదిక సమర్పించింది. సంజయ్‌పై కేంద్ర సివిల్ సర్వీసుల నియమావళి ప్రకారం, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. సౌత్రిక టెక్నాలజీస్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఆ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి.. దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేయాలని నివేదించింది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా సంజయ్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఉత్వర్వుల్లో పేర్కొంది.

# దేశానికే తలమానికంగా కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

**శిక్షణ, పరిశోధనలకు దేశ, విదేశీ ప్రతినిధులు రావటం గర్వకారణం: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం (చైతన్యరథం): కుప్పంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీ.ఓ.ఈ) దేశానికే తలమానికంలా వర్ధిల్లుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో మొట్టమొదటి సారిగా కుప్పంలో ఏర్పాటు చేసిన సీ.ఓ.ఈ నూతన వంగడాల ప్రయోగాల్లో దూసుకెళ్తోందన్నారు. మంగళవారం కుప్పంలోని హార్టికల్చర్ హబ్‌లో ఉద్యానశాఖలో అధునాతన సాంకేతిక విధానాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి విదేశీయులతో పాటు, 12 రాష్ట్రాల నుంచి వచ్చిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 40 మంది అధికారులు హాజరయ్యారు. ఢిల్లీలోని ఇజ్రాయిల్ ఎంబసీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ హార్టికల్చర్ మిషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉద్యానశాఖలో శాస్త్రీయ, సాంకేతిక పద్ధతుల్లో మల్చింగ్, డ్రిప్, సాగు పద్ధతులు, పాలి హౌసెస్‌లో మొక్కలు అంటు కట్టే విధానం, సస్యరక్షణ అంశాలపై నిష్ణాతులైన శిక్షకులచే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విదేశీయుల బృందం కుప్పంలోని హార్టికల్చర్ హబ్‌లో మూడు రోజుల పాటు పరిశోధనలు నిర్వహించి, శిక్షణ పొందనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు



దూరదృష్టితో ఆలోచించి మారుమూల ప్రాంతంలో విదేశీ పరిజ్ఞానంతో హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రం వివిధ రకాల నూతన వంగడాలు సృష్టించి జాతీయ స్థాయిలో ప్రశంసలందుకొంటోందని కొనియాడారు. కుప్పంలో ఒకప్పుడు ఒకే రకమైన మూస పద్ధతిలో పంటలు పండించే వారని, అలాంటి ప్రాంతంలో ఇప్పుడు బహుళ పంటలు పండిస్తూ స్థానిక రైతులు మంచి ఆదాయం పొందుతున్నారనన్నారు. రైతుల కోసం ఎన్నిరకాల ప్రయోగాలు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందనన్నారు. అదే విధంగా తొందరలోనే విద్యార్థులు కూడా శిక్షణ తీసుకునేలా కార్యక్రమాలు రూపొందిస్తామని, హార్టికల్చర్ యూనివర్సిటీ కూడా కుప్పంకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కుప్పం ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో పండించే కూరగాయలతో పాటు పండ్లు, పూలు ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు వీలుగా కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటుకి అన్ని ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని చెప్పారు. మరిన్ని నూతన వంగడాలు అభివృద్ధి చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రాన్ని కూడా కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులకు తాము అవలంబిస్తున్న పద్ధతులను రాష్ట్ర హార్టికల్చర్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇజ్రాయిల్ ఎంబసీ అగ్రికల్చర్ అటాచి (ప్రతినిధి) ఉరీ రూబీన్ స్టీన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా ఏపీఎంఐపీ అధికారి బాల సుబ్రహ్మణ్యం, హార్టీకల్చర్ ఏడీ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల జగజ్జీవన్ జ్యోతిని ఆర్పేసిన జగత్ కిలాడీ జగన్

- పది లక్షల దళితులు, గిరిజనుల ఇళ్ళలో చీకట్లు
- 2022 జూన్ నెల నుండి ఉచిత కరెంటుపై కత్తెర పథకం అమలు
- దళితులు, గిరిజనుల గురించి నోరెత్తే నైతిక హక్కు జగన్‌కి లేదు

దళితులు, గిరిజనులకు గత ప్రభుత్వాలు వరంగా అందించిన ఉచిత విద్యుత్ పథకం (జగజ్జీవన్ జ్యోతి పథకం)కు మంగళం పాడిన జగత్‌కిలాడీ జగన్‌మోహన్‌రెడ్డి. పది లక్షల కుటుంబాల్లో వెల్లివిరిసిన విద్యుత్ వెలుగులను అమాంతం మింగేసిన కాలాంతకుడు జగన్. అభాగ్యుల ఇళ్లల్లో చిమ్మ చీకట్లు నింపిన ఆ జగన్మోహన్‌రెడ్డికి ఉన్నట్టుండి ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గుర్తుకురావడం మహా విడ్డూరంగా ఉంది. తాను మంచివాడినని అనిపించుకునేందుకు ప్రజలకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విషపు వార్తలు ప్రచురించడం జగన్మోహన్‌రెడ్డి నీచరాజకీయానికి నిలువుటద్దం. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ 2019 ఎన్నికల ముందు గుండెలు బాదుకుని మరీ దళితులు, గిరిజనులను ~~తనవైపు తిప్పుకుని ఓట్లు వేయించుకున్న జగన్‌రెడ్డి~~ ఐదేళ్లపాటు వారి సంక్షేమానికి లాక్ డౌన్ విధించాడు. ప్రశ్నించిన గళాలను నిర్దాక్షిణ్యంగా నొక్కేశాడు. గట్టిగా నిలదీసినవారిపై అడ్డగోలుగా అక్రమ కేసులు బనాయించి తనలోని రాక్షసత్వాన్ని బయటకు తీసి వికటాట్టహాసం చేశాడు. 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డిని లెవన్ రెడ్డి అనే పదవికి దగ్గర చేయడంలో దళితులు, గిరిజనులు కీలకపాత్ర పోషించారనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు వారిని ప్రసన్నం చేసుకుంటేనే తనకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని, లేదంటే చిప్పకూడు తప్పదని జగన్మోహన్‌రెడ్డి గ్రహించినట్లు కనిపిస్తోంది. కానీ తన ఐదేళ్ల పాలనలో అణగారిన దళిత, గిరిజనులకు తన ముఖం చూపించలేక తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు టక్కుటమారం విద్యలు ప్రదర్శించే ప్రయత్నాలను జగన్ రెడ్డి చేస్తూనే ఉన్నాడు. ఈ కట్టుకథల కనికట్టు విద్యలో భాగంగా 2024 ఈ నెల మూడవ తేదీన తన విషపుత్రిక సాక్షి పత్రికలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ కట్ అంటూ వారి గుండెల్లో గునపాలు దింపాడు. అసలు వాస్తవాల్లోకి వెళితే.. ఈ ఉచిత విద్యుత్ పథకానికి కత్తెర వేసిన కటింగ్ మాస్టర్ జగన్ రెడ్డే అనేది జగమెరిగిన సత్యం. అయినప్పటికీ తాను బాగుండేందుకు తనకు అడ్డుగా ఉన్న కుటుంబ సభ్యులనైనా, ప్రభుత్వంలోని వ్యవస్థలనైనా, ప్రజలకు మేలు చేసే ఇతర ప్రభుత్వాలనైనా, ప్రతిపక్షపార్టీ నేతలు, కార్యకర్తలనైనా, తనను నమ్మిన ఉన్నతాధికారులనైనా, చివరకు మీడియా సంస్థలనైనా బలితీసుకునే మనస్తత్వం జగన్మోహన్ రెడ్డిది అనేది గత ఐదేళ్లలో అనేక సందర్భాల్లో రుజువయ్యింది. తాను చనిపోయి మరో పదిమందిని బలితీసుకునే రాచపీనుగకు...జగన్మోహన్ రెడ్డికి పెద్దగా వ్యత్యాసం ఉండదని రాజకీయ విశ్లేషకుల బలమైన అభిప్రాయం.

### ఎన్టీఆర్ పాలనలోనే ఉచిత విద్యుత్ :

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) పాలనలోనే ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభమయింది. ఒక్క బల్బు కలిగిన గుడిసెలకు ఉచిత విద్యుత్ విధానాన్ని ఎన్టీఆర్ అమల్లోకి తెచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీలకు 50 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ విధానాన్ని అమలు చేశారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ, ఎస్టీలకు 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని పెంచి ఎస్సీ, ఎస్టీల కుటుంబాల్లో వెలుగులు నింపారు.

### ఎస్సీ, ఎస్టీలు అంటే వాడలు, మురికివాడల్లోనే ఉండాలా?

2022 జూన్ నెలలో ఎస్సీ, ఎస్టీలు కాలనీల్లో నివాసం ఉంటేనే ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తామని, ఇతర ప్రాంతాల్లో ఉంటే ఈ పథకం అమలు చేయవద్దని జగన్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశాడు. వలంటీర్ల రూపంలో ఉన్న జగన్ రెడ్డి ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి, వివరాలు సేకరించి, విద్యుత్‌శాఖ అధికారులకు వివరాలు సమర్పించారు. వాటిని ఆధారంగా చేసుకుని అర్హత ఉన్నప్పటికీ పది లక్షల ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని నిలిపేశారు. దీంతో వారిపై విద్యుత్ భారం పడింది. ఈ పథకాన్ని రద్దు చేసే సమయానికే విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్న జగన్ రెడ్డి తీరుకు ఎస్సీ, ఎస్టీలు కూడా బలికావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

### కత్తెర పథకానికి అడ్డగోలు నిబంధనలు :

జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీలపై విద్యుత్ భారాన్ని మోపేందుకు చేపట్టిన జగనన్న కరెంటు కత్తెర పథకానికి అడ్డగోలుగా నిబంధనలు విధించాడు.

**1. ఎస్సీలు, ఎస్టీలు కాలనీల్లోనే ఉండాలి, బయట వేరే ప్రాంతాల్లో ఉండకూడదు.**

**2. ఎస్సీ, ఎస్టీలకు సొంత ఇల్లు ఉంటే, అద్దెకు ఇవ్వకూడదు.**

**3. ఎస్సీ, ఎస్టీలకు అదనపు మీటర్లు ఉండకూడదు.**

**4. ఎస్సీ, ఎస్టీల్లో ఉద్యోగాలు చేసేవారు ఉండకూడదు.**

**5. ఎస్సీ, ఎస్టీలు ఆదాయపు పన్ను చెల్లించకూడదు.**

### ఎస్సీ, ఎస్టీలపై జగన్‌రెడ్డి కులవివక్ష :

ఎస్సీ, ఎస్టీలు అంటే కేవలం వారికి కేటాయించిన కాలనీల్లో ఉండాలని జగన్ రెడ్డి విధించిన నిబంధన వారి పట్ల జగన్ రెడ్డికి ఉన్న కులవివక్షకు నిదర్శనం. ఎస్సీ, ఎస్టీలను బానిసలుగా భావించే జగన్‌రెడ్డి అండ్ కో వారిని ఐదేళ్లపాటు అణచివేతలకు గురిచేసి వేధించారు. ఎస్సీ, ఎస్టీలు బ్రతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసించే పరిస్థితుల్లో తమ ఇళ్లను అంధకారమయం చేయాల్సిందే. అంతేకాని ఎవరికీ అద్దెకు ఇవ్వకూడదు. ఎస్సీ, ఎస్టీలు ఎల్లకాలం బానిసలుగా నీ బాంచన్ దొర అనే విధానంలోనే బ్రతకాలి తప్ప, ఉద్యోగాలు చేయకూడదనేది ఈ పథకానికి పెట్టిన నిబంధనల ద్వారా జగన్ రెడ్డి మనస్తత్వం బట్టబయలైంది. ఆదాయపు పన్ను చెల్లించే స్థాయికి దళితులు, గిరిజనులు ఎదగ కూడదు. వెళ్లిన వారికి ప్రభుత్వం అందించే ఉచిత సంక్షేమ పథకాలు దక్కకుండా చేసి వేధించడం జగన్ నైజం. ఎస్సీలు వ్యాపారాలు చేసి భవిష్యత్తులో పైకి రాకూడదు. వాళ్లు వ్యాపారవేత్తలు కాకూడదు. అందుకే సబ్సిడీ రుణాలు అనే పథకాన్ని రద్దు చేశాడు. దళితులు తమ సొంత కాళ్లపై నిలబడకూడదనేది జగన్ విధానం. అందుకే వారికి స్వయం ఉపాధి కల్పించే పథకాలను దూరం చేశాడు. దళితులకు సొంత భూములు ఉండకూడదని, వాళ్లు సొంత పొలంలో వ్యవసాయం చేసి బ్రతకకూడదనేది జగన్ మనస్తత్వం. అందుకే భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేశాడు. ఇలా చెప్పుకుంటూ పోతే దళితులకు చెందిన 26 సంక్షేమ పథకాలను జగన్ రెడ్డి రద్దు చేసి దళితుల పట్ల తనకున్న చిన్నచూపును ప్రదర్శించాడు. ఐదేళ్లపాటు దళితులను అంటరానివారిగా, బానిసలుగా, కేవలం వైసీపీ జెండాలు మోసే రోజువారీ కూలీలుగా పరిగణించిన జగన్ రెడ్డి, ఇప్పుడు సిగ్గు, శరం గాలికొదిలేసి దళితులు, గిరిజనులు, సంక్షేమం అంటూ కారుకూతలు కూస్తున్నాడు. ఇలాంటి వ్యక్తికి ఎస్సీలు, ఎస్టీలు గురించి నోరెత్తే నైతిక హక్కు, అర్హత లేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

### కరెంటు కత్తెర దెబ్బకు చితికిన బడుగుల బతుకులు

జగన్ రెడ్డి ప్రవేశపెట్టిన కరెంటు కత్తెర పథకానికి నెల్లూరు జిల్లాలో 95,000 కుటుంబాలపై కరెంటు భారం పడింది. ఏలూరు జిల్లా భీమవరంలో 3,244మంది, ఏలూరు రూరల్ 2,525మంది, ఏలూరు టౌన్ 2,864మంది, జంగారెడ్డిగూడెం 6,973మంది, నిడదవోలు 2,618మంది, పాలకొల్లు 3,581మంది, తాడేపల్లిగూడెం 2,531మంది, తణుకు 2,820మంది ఎస్సీ, ఎస్టీలకు జగన్ రెడ్డి ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేశాడు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 19,996 మంది ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ కనెక్షన్లు ఉంటే వారిలో అత్యధికులను అనర్హులుగా ముద్ర వేసి వారికి ఉచిత విద్యుత్ నిలిపేశారు. కాకినాడ జిల్లాలో 1,10,000కనెక్షన్లు ఉండగా వాటిలో అధిక సంఖ్యలో ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే చిట్టా కొండవీటి చాంతాడంతగా సాగుతుంది. కానీ ఇవేవీ ప్రజలకు తెలియవన్నట్లు ఎస్సీ, ఎస్టీలు అమాయకులు, వాళ్లకు ఏమి చెప్పినా నమ్మేస్తారు అనే ఉద్దేశంలో జగన్ రెడ్డి వూగిపోయాడు. జగన్ రెడ్డి తమకు చేసిన అన్యాయాన్ని మనసులోపెట్టుకుని మొన్న జరిగిన ఎన్నికల్లో మాడు పగల కొట్టేశాడు.

### జగనన్న కరెంటు ఛార్జీల పెంపు పథకంతో రూ.64,388కోట్ల పెనుభారం :

జగన్మోహన్ రెడ్డి తన పాలనలో పలుమార్లు కరెంటు చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజల నడ్డి విరిచాడు. ఆ జాబితాలో 10లక్షల ఎస్సీ, ఎస్టీల కుటుంబాలను కూడా చేర్చి తన కర్కోటక నైజాన్ని ప్రదర్శించాడు. 500 యూనిట్లు దాటిన వారిపై 90పైసలు వడ్డింపుతో రాష్ట్ర ప్రజలపై రూ.1,300 కోట్లు, శ్లాబులు మార్పుతో రూ.1,500కోట్లు, కిలోవాట్‌కి రూ.10పెంపుతో రూ.3,542కోట్లు, ట్రూఅప్ చార్జీలు పేరుతో రూ.3,669కోట్లు, శ్లాబులు కుదించే పేరుతో 3,900కోట్లు, ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ పేరుతో రూ.700కోట్లు, విద్యుత్ కొనుగోళ్ల సర్దుబాటు పేరుతో రూ.3,082కోట్లు, ఫ్యూయల్ అండ్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో రూ.400కోట్లు, ట్రూ అప్ చార్జీలు పెంపుతో రూ.7,200 కోట్లు మొత్తం రూ.25,193కోట్ల విద్యుత్ భారాన్ని జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలపై, ముఖ్యంగా 10లక్షల ఎస్సీ, ఎస్టీల కుటుంబాలపై మోపాడు. ఇవి కాకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పు రూ.36,261 కోట్లు, హిందూజా కంపెనీకి చెల్లించేందుకు తెచ్చిన అప్పు రూ.2,834 కోట్లు. జగన్ తన ఐదేళ్ల పాలనలో దాదాపు రూ.64,388 కోట్లకు పైబడిన భారాన్ని రాష్ట్ర ప్రజల నెత్తిన మోపాడు అనేది అక్షర సత్యం.

ఇలాంటి దుర్మార్గులు నేడు ఎస్సీ, ఎస్టీలపై సవతితల్లి ప్రేమ చూపించడం, కపట నాటకాలకు తెరలేపడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఎస్సీ, ఎస్టీలకు నిజమైన సంక్షేమం, అభివృద్ధికి దూరం చేయడమే జగన్ రెడ్డి లక్ష్యం. తనను ఓడించి లెవన్ రెడ్డిగా మారేలా చేసిన ఎస్సీ, ఎస్టీలపై కక్షసాధింపులో భాగంగానే జగన్ రెడ్డి నేడు భారీ కుట్రకు తెరలేపాడు అనే విషయాన్ని దళిత, గిరిజన ప్రజలు తెలుసుకోవాలి. జగన్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనలకు చెంపదెబ్బ, చెప్పుదెబ్బలతో వాయించి తమ సత్తా చూపించాలి. అప్పుడే ఇలాంటి దుర్మార్గుల కుట్రల నుండి దళితులు, గిరిజనులు బయటపడగలుగు తారు.

మునీంద్ర కొడాలి
- పొలిటికల్ అనలిస్టు

---

## పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలి

**- డిప్యూటీ సీఎం పవన్‌కు గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్ సోర్సింగ్ టీచర్లు, గెస్ట్ లెక్చరర్ల వినతి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్లు మంగళవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం వద్ద ఉప ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న తమను కాంట్రాక్టు లెక్చరర్లుగా మార్పు చేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. మంజూరైన పోస్టుల్లోనే తాము సంవత్సరాల తరబడి పని చేస్తున్నామని, అతి తక్కువ జీతాలు ఇస్తూ తమ శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పట్ల పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. సంఘం నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తిరుమల ప్రసాదం అందజేసిన ఎంపీ కలిశెట్టి



ఢిల్లీ (చైతన్యరథం): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. పార్లమెంట్‌లోని స్పీకర్ కార్యాలయంలో మంగళవారం ఆయనను ఎంపీ, నేతలు కలిశారు. ప్రపంచ ప్రఖ్యాత హైందవ క్షేత్రం తిరుమల స్వామివారి దర్శనానికి రావాలని స్పీకర్‌ను ఆహ్వానించారు. అదేవిధంగా, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత శ్రీపైడితల్లి అమ్మవారి పూజార్చన విశిష్టతను కూడా స్పీకర్‌కి వివరించారు. విజయనగరానికి చెందిన పైడితల్లి అమ్మవారి జాతరకు ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవాలని కూడా స్పీకర్‌ను ఆహ్వానించారు.

# కాసులేమో జగన్‌కి.. వాతలేమో జనానికి..

- నీలి మీడియాలో నీచ రాతలు.. నమ్ముతారా ప్రజలు
- ముడుపుల దందా.. కప్పేయడానికి తప్పుడు రాతలు
- ఏమార్చేందుకు కుంటి సాకులు, కాకిలెక్కలు
- ప్రజలపై భారాలు మోపినందుకు చేయాలా సన్మానాలు.. కప్పాలా శాలువాలు!
- మెట్టుతో కొట్టినట్టు ఓటుతో కొట్టి...
- తగిన శాస్తి ఎప్పుడో చేసేసారు జనాలు

విద్యుత్ ఒప్పందాల్లో అక్రమాల కేసులో అప్పటి ముఖ్యమంత్రి అంటూ జగన్ రెడ్డి పేరు చక్కర్లు కొడుతోంది. సెకి నుండి విద్యుత్ కొనుగోలు చేయాలని సెకి జూన్ 2020లో రాష్ట్రాలకు ప్రతిపాదన చేసింది. అయితే 18 నెలలు దాటినా, ఏ ఒక్క రాష్ట్రం కూడా విద్యుత్ కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు. అంత ఎక్కువ ధరకు విద్యుత్ కొనలేం, మాకు మీ కరెంటు వద్దు అని తేల్చి చెప్పేశాయి. కానీ జగన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమే, ముందుకు వచ్చి విద్యుత్ కొనుగోలు చేసింది. అన్ని రాష్ట్రాలు వద్దు అంటుంటే, జగన్ రెడ్డి మాత్రం మాకు కావాలి అంటూ ఎక్కువ ధరకు విద్యుత్ కొనడానికి ఒప్పుకున్నారు. ఈ ఒప్పందం కోసం ఆగస్టు 2021లో ఓ రోజు అర్ధరాత్రి హడావిడిగా విద్యుత్ ఫైల్‌ను పరిగెత్తించారు. అధికారులు, మంత్రులు ఆఘమేఘాల మీద అర్ధరాత్రి పరుగులు తీశారు. అప్పటి సీఎం ఏకంగా రూ.1750 కోట్ల లంచాలు డైరెక్ట్‌గా తీసుకున్నారని ఎఫ్బీఐ చెబుతోంది. ఇదిలా ఉంటే ఇండియాలో కోర్టుల్లో కేసులు రుజువు అయ్యేందుకు కొంత సమయం పడుతుందని తెలిసిందే. కొన్ని నేరాల్లో తీర్పులు ఇచ్చేందుకు ఏళ్లు పడుతుంది. అయితే అమెరికా కోర్టుల్లో మాత్రం ఏడాదిలోపే కేసును తేల్చేస్తాయట. దీనిని బట్టి నేరం రుజువైతే అదానీ ఇతర నిందితులతో పాటూ మాజీ సీఎం జగన్‌రెడ్డి కూడా జైలుకు వెళ్లక తప్పదు. అంతేకాకుండా మనదేశంలో జైలుకు వెళ్లినా ఇంటిభోజనం రప్పించుకునేందుకు కొంతమందికి అనుమతిస్తుంటారు. కానీ అమెరికా జైళ్లలో మాత్రం బ్రెడ్డు, జామ్ తప్ప ఇంటి నుండి ఆహారం తీసుకునేందుకు అనుమతి ఇవ్వరంట. ప్రస్తుతం ఇదే విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

### ప్రజలను ఏమార్చేందుకు బులుగు ముఠా దేనికైనా దిగజారుడే..

అబద్ధాన్నే నమ్ముకున్న వైసీపీ నేతలు... గాడిదను గుర్రాన్ని చేస్తారు. గుర్రాన్ని గాడిదను చేస్తారు... ప్రజలను ఏమారుస్తుంటారు. తప్పుడు రాతలతో తప్పుడు కథనాలతో... నీలిమీడియాను అడ్డంపెట్టుకుని ప్రజలను మోసం చేస్తుంటారు. నాడు అధికారం అడ్డం పెట్టుకుని.. పిశాచి మూకల్లా రాష్ట్రంపై పడి జనాలను పీక్కు తిన్నారు. దోపిడీకి కాదేదీ అనర్హం అన్నట్లు ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారు. చివరకు చెత్తపై కూడా పన్నులు వేసి చెత్త ప్రభుత్వం అనిపించుకున్నారు. కరెంట్ ఛార్జీలు పెంచేది లేదని డాంబికాలు పలికి.. తొమ్మిది సార్లు ఇష్టారాజ్యంగా కరెంట్ ఛార్జీలు పెంచడమే కాకుండా సర్ ఛార్జీల పేరుతో దందా చేశారు. షిరిడీ సాయి ఎలక్ట్రానిక్స్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్ల పేరుతో వందల కోట్లు కట్టబెట్టి.. ప్రజలపై పెనుభారం మోపి కమీషన్‌లు దండుకున్నారు. సెకీ వద్ద విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల పేరుతో రూ.1750 కోట్లు ముడుపులు దండుకుని రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్లకు పైగా భారం వేశారు. అమెరికా ఎఫ్బీఐ గుట్టురట్టు చేయడంతో.. కోడ్‌లో రాసుకున్న ముడుపుల చెల్లింపుల భాగోతం బట్టబయలైంది. జగన్ దందా బాగోతం సప్త సముద్రాలను చుట్టేసింది. అంతటితో ఆగకుండా...

### తక్కువకు కొన్నామని తప్పుడు రాతలు :

తాడేపల్లి కొంపలో చీకటి ఒప్పందాలు చేసుకుని.. ఒక్క రోజులోనే మంత్రి వర్గంతో మమా అనిపించుకున్నదే తడవుగా సిగ్గొదిలేసి ముడుపులు దండుకుంది. యూనిట్ రూ.2.49 పైసలకే కొన్నామని వైసీపీ ముడుపుల ముఠా గొప్పల డప్పు కొడుతోంది. వైసీపీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోవడానికి ముందే.. గుజరాత్‌తో పాటు పలు రాష్ట్రాల్లో సోలార్ పవర్‌ను యూనిట్ రూ.1.99కే సెకీ నుండి ఆ రాష్ట్ర ప్రభుత్వాలు కొన్న విషయం వైసీపీ నేతలకు ఎందుకు తెలియడంలేదు. జనాలను మోసం చేసి స్వప్రయోజనాల కోసం కుదుర్చుకున్న డీల్ కాకుంటే. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంలో సోలార్, విండ్ ఎనర్జీల వినియోగాన్ని కేంద్రం ఖచ్చితంగా వినియోగించాలని చెప్పడంతో అప్పుడున్న రేట్ల ప్రకారం రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని తీసుకువచ్చేందుకు చంద్రబాబు కొనుగోలు చేసిన యూనిట్ ధర అన్ని రాష్ట్రాలకంటే తక్కువే.. ఆ ధరను నేడు జగన్ రెడ్డి చూపిస్తూ.. బుకాయిస్తున్నారు. జగన్ రెడ్డి కొనుగోలు చేసినప్పుడు సోలార్ పవర్ రేట్లు చాలా పడిపోయాయి. యూనిట్ రూ.1.50 కంటే తక్కువగా దొరికే పరిస్థితి ఉంది. అయినా.. ఎక్కడో రాజస్తాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్ పెట్టి.. అక్కడి రాష్ట్ర ప్రజలకు మేలు చేసే ప్రాజెక్ట్ నుండి.. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం చేసుకొని మన రాష్ట్ర ప్రజలపై పెను భారం వేసేందుకు జగన్ రెడ్డి దొడ్డి దారిలో నడిపిన గూడుపుఠాణిమే విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం. ఈ చీకటి ఒప్పదంతో దాదాపు రూ.1.56 లక్షల కోట్లు భారం ఏపీ ప్రజలపై పడనుంది.

### చంద్రబాబుతో రాష్ట్రంలో వెలుగులు.. జగన్ దోపిడీతో చీకట్లు :

రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు నింపిన విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రస్తుతం రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తిలో మొత్తం వాటా 20 వేల మెగా వాట్లు ఉంటే.. అందులో దాదాపు 15 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చంద్రబాబు ముందు చూపుతోనే సాధ్యమైంది. ఏపీలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధితో పాటు రాష్ట్రంలో ఉన్న చీకట్లను తరిమికొట్టి.. రైతులకు మేలు చేసేలా.. విద్యుత్ ఉత్పాదనకు చంద్రబాబు కృషి చేస్తే.. గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి ఒక్క పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకపోగా.. తన స్వార్థ ప్రయోజనాలకోసం.. ప్రజలపై బాదుడే బాదుడుగా పెనుభారాలు మోపాడు. కుటిల ఒప్పందాలు చేసుకున్నాడు. ముడుపుల కోసం ఎక్కడో రాజస్తాన్‌లో ఉన్న విద్యుత్ సోలార్ ప్లాంట్ నుండి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాడు. అదే ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు చేస్తే.. ఇక్కడి యువతకు.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో మేలు జరిగేది. ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల గురించి, ప్రజల శ్రేయస్సు గురించి జగన్ ఆలోచించిది లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి అక్రమ మార్గాల్లో దోచుకోవడం, ప్రజలను ఏమార్చడమే తెలుసు. జగన్ రెడ్డి చేసిన మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతుంటే.. కప్పను మింగిన పాములా.. రోత పేపర్‌ను అడ్డం పెట్టుకుని తప్పుడు రాతలు రాయిస్తూ కవర్ చేస్తున్నాడు. ఏనాటికైనా నిజం అనేది బయట పడాల్సిందే. న్యాయం అనేది గెలవాల్సిందే. దుర్మార్గం నశించాల్సిందే. జగన్ రెడ్డి పాపాలు పండాల్సిందే. ఆ సమయం దగ్గర పడింది.

### ప్రజలను ఏమర్చేందుకు జగన్ రెడ్డి మాయమాటలు :

రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా నిలిచిన సెకి ఒప్పందంపై జగన్ తన అనుకూల మీడియా ముందు విలేకర్లు అడిగిన ప్రశ్నలకు అడ్డగోలుగా సమాధానాలు ఇచ్చారు. "నేను ముఖ్యమంత్రిగా ఉన్నా, నాకూ సీఐడీ ఉంది, ఒకవేళ ఇక్కడేదో అమెరికన్ కంపెనీ ఉంటే దానిపై కేసులో అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేరు కూడా రాయమని సీఐడీకి చెబితే అయిపోతుందా.? అని రాగాలు తీశాడు. ఓ అమెరికన్ కంపెనీ ఇక్కడ ఒక రాష్ట్రంలో వ్యాపారం చేస్తుంటే.. ఆ రాష్ట్ర ప్రభుత్వం భూమిని రాయితీ ధరలతో ఇస్తే, జీఎస్టీ రద్దు, ఇతర ప్రోత్సాహకాలు కల్పిస్తే అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రభావం వల్లే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాలిచ్చిందని ఎవరైన మాట్లాడితే అందులో అర్థం ఉంటుందా.? ఎఫ్‌బీఐ నివేదికలో నా పేరు ఎక్కడా లేదు.. నా పేరు ఉందని చెప్పేది తెలివితక్కువ వారే. వాళ్ల వద్ద ఏం డాక్యుమెంట్లు ఉన్నాయో నాకు తెలియదు. వాళ్లు ఏం దర్యాప్తు చేస్తున్నారో తెలియదని బొంకేస్తాడు. సెకితో ఒప్పందంలో అప్పటి సీఎం జగన్‌కు రూ.1,750 కోట్ల లంచం ఇచ్చారని ఎఫ్‌బీఐ, యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ అమెరికాలో కోర్టుకు నివేదిక సమర్పించాయి కదా" అని విలేకర్లు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానలిచ్చారు. సౌర విద్యుత్తును అధిక రేట్లకు కొనుగోలు చేయడమే కాక.. ప్రజలపై భారీ మొత్తంలో భారం మోపి.. అంతా తక్కువ రేటుకు దేశంలో ఏ ముఖ్యమంత్రి కొనుగోలు చేయని పరిస్థితుల్లో తాను చేసిన దానికి శాలువాలు కప్పి.. సన్మానాలు చేయాలి.. అని తానకు తానే డాంబికాలు పలకడం జగన్ రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరినట్లు కనిపిస్తోంది.

### సీమ ద్రోహి జగన్ రెడ్డి :

7,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మన రాష్ట్రంలో ఏర్పాటు చేయకుండా, రాజస్థాన్‌లో నెలకొల్పిన ప్రాజెక్టుల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా, ముఖ్యంగా అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాల్లో ఉన్న రైతులపై ప్రభుత్వం అన్యాయం చేసింది. సాగునీటి సదుపాయం లేక పొలాలను బీళ్ళుగా వదిలేసిన రైతులు, ఈ ప్రాజెక్టుల వల్ల లబ్ధి పొందే అవకాశం కోల్పోయారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములకు ఎకరానికి రూ. 30,000 లీజు చెల్లిస్తారు. లీజు మొత్తాన్ని రెండేళ్లకోసారి 5 శాతం పెంచుతారు. ఒక్కో ప్రాజెక్టు జీవితకాలం 30 ఏళ్లుగా లెక్కిస్తే, ఒక్కో రైతుకు లీజు రూపంలో సుమారు రూ.12.94 లక్షలు లభించేది. ఇది వాణిజ్య పంటలు పండించే రైతుల ఆదాయానికి సమానమే. మెగావాట్‌కు 5 ఎకరాల చొప్పున 7,000 మెగావాట్లకు మొత్తం 35,000 ఎకరాలు అవసరం అవుతుంది. దీనితో రైతులకు లీజు రూపంలో సుమారు రూ. 4,531.54 కోట్ల ఆదాయం లభించేది. కానీ, జగన్ రెడ్డి ప్రభుత్వం స్థానిక రైతులకు లబ్ధి కలిగించే ఈ అవకాశం వదిలేసి, రాజస్థాన్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా కమీషన్ల కోసం రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టిందన్న విమర్శలు ఎదురవుతున్నాయి.

### ఉపాధికి.. గండి :

వైసీపీ పాలనలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకురాకపోగా, ఉన్న పరిశ్రమలను బెదిరించి.. తరిమికొట్టి.. వేల మందికి ఉపాధి లేకుండా చేశారు. సౌర విద్యుత్ విషయంలోను అదే నిర్వాకం వెలగబెట్టింది. సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో మెగావాట్‌కు సగటున ఇద్దరిని తీసుకున్న.. 7 వేల మెగా వాట్లకు 14 వేల మందికి ఉపాధి లభించేది.

- జమ్ము సాయి కల్యాణ్
అనలిస్ట్

---

# గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి

**- చట్టవిరుద్ధంగా పవర్ ప్రాజెక్టులను కట్టబెట్టారు**

**- టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ ధ్వజం**

మంగళగిరి (చైతన్యరథం): జగన్ హయాంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్యంలో జలాశయాల నుంచి నీటిని ఎత్తిపోస్తూ విద్యుదుత్పత్తి చేసి నిల్వ చేసే ప్రాజెక్టులను చట్టవిరుద్ధంగా గత జగన్ సర్కార్ అదానీ పవర్ సంస్థలకు కట్టబెట్టిందని తెలిపారు. జగన్ సర్కార్ గిరిజన హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. 14,680 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నిల్వ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 14 ప్రాజెక్టులను వివిధ సంస్థలకు ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో జగన్ ప్రభుత్వం కేటాయించింది. వీటిలో నాలుగు ప్రాజెక్టులు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం గిరిజన జిల్లాల్లో ఉన్నాయి. గిరిజనేతర పేదలు ఇళ్లు కూడా కట్టుకోలేని విధంగా మన్యంలో చట్టాలు అమలవుతున్న తరుణంలో హైడ్రో ప్రాజెక్టులను మాత్రం చట్టవిరుద్ధంగా గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ధారునాయక్ ప్రశ్నించారు.

ఈ నాలుగు ప్రాజెక్ట్‌ల్లో మూడు అదానీ కంపెనీకి, మరొకటి హైదరాబాద్‌లోని షిరి డీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టారు. షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ జగన్ బంధువుకు చెందినది కాగా..ఈ ప్రాజెక్టుల కోసం మొత్తంగా సుమారు 2 వేల ఎకరాలకు పైగా భూమి అవసరం. వీటిలో 25 శాతం వరకు అటవీ భూములు, తక్కినవి పట్టా భూములు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టేందుకు చట్టాలు అనుమతించవన్న సంగతి తెలిసి కూడా జగన్ రెడ్డి అడ్డగోలుగా కేటాయించేశారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుల మూలంగా నిరాశ్రయులయ్యే గిరిజన జాతులు, గిరిజన ఆవాసాలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. వీటిపై ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై ఉద్యమాలు సాగినా జగన్ సర్కారు పట్టనట్టే వ్యవహరించింది. గిరిజన ప్రాంత చట్టాల ప్రకారం గిరిజనులకు, గిరిజనులు సభ్యులుగా ఉన్న సహకార సంఘాలకు తప్ప ఇతరులకు గిరిజన ప్రాంతాల్లో ఏ రూపంలోనూ భూములను బదలాయించే అవకాశం లేదు. కానీ జగన్ సర్కార్ మాత్రం ఈ చట్టాలను తుంగలో తొక్కింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఏ విధమైన ప్రాజెక్టులు చేపట్టాలన్నా ఆయా గ్రామసభల తీర్మానాలు, రాష్ట్ర గిరిజన సలహా మండలి ఆమోదం అవసరం. కానీ ఇవేమీ లేకుండానే ఈ ప్రాజెక్టులు మంజూరు చేశారు. సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసిన గిరిజన ద్రోహి జగన్ రెడ్డి అని ధారు నాయక్ ధ్వజమెత్తారు.

---

# తిరుమల క్యూలైన్లలో టీటీడీ చైర్మన్ తనిఖీలు



తిరుమల (చైతన్యరథం): తిరుమల దర్శన క్యూ లైన్లలో మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఏటీజీహెచ్ వద్దనున్న స్లాటెడ్ సర్వ దర్శన క్యూలైన్లను పరిశీలించి నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫుట్‌పాత్ హాల్ (దివ్యదర్శనం)ను తనిఖీ చేసి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్‌లో టీటీడీ అందిస్తున్న సేవలపై భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు లడ్డూలు రుచికరంగా, నాణ్యంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మరికొందరు భక్తులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనంలో తమకు దర్శనం మరింత త్వరగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని చైర్మన్‌ను కోరారు. క్యూలైన్ల విధానం, దర్శన సమయం వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి సదుపాయాలు మెరుగుపర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, వైకుంఠం ఏపీఎస్ఓ విశ్వనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి దుర్గేష్



బొమ్మూరు (చైతన్యరథం): మంత్రి దుర్గేష్ మానవత్వం చాటుకున్నారు.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి దగ్గరుండి ప్రథమ చికిత్స అందేలా సాయపడటంతో పాటు.. తన సిబ్బంది ద్వారా ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు జాతీయ రహదారి వద్ద సోమవారం ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని కారు ఢీ కొట్టింది. ఆ ఘటనలో వాహనదారుడికి గాయాలు కావడంతో స్థానికులు స్పందించి సపర్యలు చేశారు. అదే సమయంలో అటుగా నిడదవోలు కార్యాలయానికి వెళుతున్న మంత్రి దుర్గేష్ ప్రమాదాన్ని గమనించి కాన్వాయ్ నిలిపించారు.

వెంటనే క్షతగాత్రుడి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. అనంతరం తన వ్యక్తిగత సిబ్బందిని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర వాహనానికి సమాచారం ఇప్పించడంతో పాటు.. మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి తరలించేలా చొరవ చూపారు. పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# డాక్టర్ ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

- జిల్లా కోర్టులో ఇంప్లీడ్ కేసు వేసిన రఘురామకృష్ణరాజు



ఉండి (చైతన్యరథం): ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో అప్పటి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి వేసిన ముందస్తు బెయిల్‌పై మంగళవారం జిల్లా కోర్ట్‌లో విచారణకు వచ్చింది. ఈ కేసులో తమను ఇంప్లీడ్ చేయాలని రఘురామ కృష్ణ రాజు పిటిషన్ వేశారు. రఘురామ తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటిషన్ వేశారు. రఘురామపై థర్డ్ డిగ్రీ ప్రయోగంలో ప్రభావతి కూడా హత్యాయత్నంలో భాగస్వాములు అయ్యారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. రఘురామ కృష్ణం రాజును పరీక్షించిన వైద్య బృందం ఆయన కాలుపై బలమైన దెబ్బలు ఉన్నాయని నివేదిక ఇచ్చారని న్యాయవాది తెలిపారు. ఆయన రెండు కాళ్ళకు బలమైన దెబ్బలతో పాటు వాచి ఉన్నాయని పిటిషనర్ వెల్లడించారు.

వైద్య బృందం ఇచ్చిన నివేదికను టాంపరింగ్ చేశారని, అందుకు భిన్నంగా నివేదిక ఇవ్వడం లో ప్రభావతి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న అని చెప్పినప్పటికీ గుండెలపై కూర్చొని బాధారని చెప్పినప్పటికీ ప్రభావతి ఈ అంశాన్ని తొక్కి పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువలనే ఆమెకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పేర్కొంటూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ కోరారు.

# ఎక్స్‌ప్రెస్‌ల బస్సులను కొవ్వూరు పట్టణంలోకి అనుమతించాలి



కొవ్వూరు (చైతన్యరథం): పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ప్రజలు దూర ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు అన్నారు.

కొవ్వూరు పట్టణంలోకి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్డీవో రాణి సుస్మితకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు కం రైలు బ్రిడ్జి భద్రత పేరుతో ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించక పోవడంతో పట్టణ ప్రజలు దూర ప్రయాణాలకు వెళ్లాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్, హైటెక్ బస్సులు కొవ్వూరులోకి రాకుండా గామన్ వంతెన మీదుగా రాజమహేంద్రవరం వెళ్లిపోతున్నాయని, దీంతోప్రయాణికులు టోల్‌గేట్ వద్ద దిగి టౌన్‌లోకి రావడానికి అధికమొత్తం చెల్లించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. రాత్రుళ్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, విద్యార్థినులు గామన్ వంతెన అండర్ టన్నెల్ వద్ద బస్సు ఎక్కడానికి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంతెన నుంచి ఆర్టీసీకి చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను పట్టణంలోకి అనుమతించాలని కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలో జరగనున్న డివిజనల్ సమావేశంలో అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సూరపనేని సోమయ్య తదితరులు ఉన్నారు.

# జగన్ ఆర్థిక విధ్వంసం చేసి వెళ్లిపోయాడు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): జగన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసం చేసి వెళ్లిపోయాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో తననివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి చేసిన ద్రోహానికి, అన్యాయాలకు అక్రమాలకు ఉరిశిక్షే సరి అని వ్యాఖ్యానించారు. జగన్ గంజాయి, మ త్తుమాదక ద్రవ్యాలను పెంచిపోషించాడని, అక్రమ మద్యంతో దోచుకున్నాడని ధ్వజమెత్తారు. పోలవరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా జగన్ వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని వెయ్యి కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సివస్తోందన్నారు. శాశ్వతంగా అధికారంలోకి ఉంటానని ఊహాల్లో ఉండి రూ.560 కోట్లు పెట్టి రుషి కొండపై ప్యాలెస్ కట్టుకున్నాడని ధ్వజమెత్తారు. గడచిన ఐదేళ్లలో నీటిపారుదలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రూ.3వేల పింఛను పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నాడని, తల్లిని చెల్లిని బయటకు గెంటేశాడని విమర్శించారు. అదాని కేసులో తన ప్రమేయం లేదని అంటున్న జగన్ అప్పుడు ఆయన సీఎం కాదా అని ప్రశ్నించారు. ఇంటర్నేషనల్ సంస్థ చర్యలు తీసుకోవడానికి తన పేరు లేదని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క వ్యవస్థ ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. అసైన్డ్ భూముల్లో లక్షలాది ఎకరాలను వైసీపీ దోచుకుందన్నారు. అన్ని లెక్కలు తేలుతాయన్నారు. జగన్‌ను చెప్పులు రాళ్లతో సత్కరించాలా అని ప్రశ్నించారు. అధికారం ఉందని గతంలో ప్రజలకు అందించాల్సిన బియ్యం వైసీపీ నేతలు విదేశాలకు తరలించేశారని... సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లపై ఎవరు పోస్టులు పెట్టారో వారు శిక్ష అనుభవిస్తారన్నారు. ఈ సమావేశంలో టూ రిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కడియం టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘు రాం, దాలిపర్తి వేమన తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం!



రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి పర్యాటక మహర్దశ పడుతుందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ సహకారంతో ఇప్పటికే టెంపుల్ టూరిజం ప్రత్యేక సర్వీసులు ప్రారంభించామన్నా రు. గోదావరి నదిపై మూడు కిలోమీటర్ల పొడవున్న హెవ్‌లాక్ బ్రిడ్జికి పర్యటక శోభ తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి దుర్గేష్ కృషి చేస్తున్నారని, కేంద్రమంత్రి షెరావత్‌తో మాట్లాడారని చెప్పారు. హెవ్‌లాక్ బ్రిడ్జి పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయింపజేశారని చెప్పారు. గోదావరి లంకల్లో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పుష్కరాలకు ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈనెల 12న ఢిల్లీకి ఎయిర్ బస్ సర్వీస్‌లు ప్రారంభమౌతాయని, అలాగే షిర్డీ, తిరుపతికి సర్వీసులు మొ దలవుతాయని, దేశంలో ముఖ్యపట్టణాల నుంచి విమాన సర్వీసులు రాజమహేంద్రవరానికి తిప్ప డం ద్వారా ఇక్కడ పర్యాటక ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన ఇన్‌ఛార్జ్ అనుశ్రీ సత్యనారాయణ, యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్, బుడ్డిగ రాధ, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, నల్లం శ్రీను, నిమ్మలపూడి గోవిందు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ సర్వే

భీమవరం (చైతన్యరథం): జిల్లా వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే (ఎంఎస్ఎం ఈ) ప్రారంభం కానుంది. ఈనెల 4వ తేదీ నుంచి జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వేలో వ్యాపారాలకు సంబంధించి ప్రతి షాపు, పరిశ్రమల నుంచి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేస్తారు. ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేస్తారు. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో కమిషనర్ల పర్యవేక్షణలో సర్వే చే స్తారు. సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలకు, కమిషనర్లకు అవగాహన కల్పించారు. 3వ తేదీన సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి 4వ తేదీ నుంచి సర్వే ప్రారంభిస్తారు. ఎనిమిది అంశాలపై సర్వే చేస్తారు సంబంధిత వ్యాపార యజమానులు అందించే వివరాలను యాప్ ద్వారా నమోదు చేస్తారు. వ్యాపార యజమాని ఎవరు? ఎంత పెట్టుబడితో పెట్టారు? వ్యాపారం ఎలా ఉంది? సిబ్బంది కొరత ఏమైనా ఉందా? కొత్త సాంకేతికత వినియోగిస్తున్నారా? సిబ్బందికి శిక్షణ అవసరమా? బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సరుకు ఎవరికి ఎగుమతి చేస్తారు? ట్రేడింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? తదితర అంశాలపై సర్వే చేస్తారు. ఈ సర్వే ఆధారంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ద్వారా ఎటువంటి సహాయం కోరుతున్నారో గుర్తించి వాటిని అందించి వ్యాపారాభివృద్ధికి సహకరించే విధంగా ఈ సర్వే ఉపయోగ పడుతుందని చెబుతున్నారు.



